మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 18-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 | సంచిక: 139 Issue: 139

Published from Jagitial
www.evarthalu.com

18 నవంబర్ 2025 - మంగళవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:26 సూర్యాస్తమయం - సా. 5:36 తిథిః త్రయోదశి ఉ. 7:12 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం స్వాతి ఉ. 7:52o వరకు యోగం ఆయుష్మాన్ ఉ. 8:07 వరకు కరణం వనిజ ఉ. 7:12 వరకు విష్టి రా. 8:27 వరకు వర్జ్యం ఉ. 11:18 నుండి మ. 1:06 వరకు దుర్ముహూర్తం ఉ. 8:40 నుండి ఉ. 9:25 వరకు రా. 10:44 నుండి రా. 11:35 వరకు రాహుకాలం మ. 2:48 నుండి సా. 4:12 వరకు యమగండం ఉ. 9:13 నుండి ఉ. 10:37 వరకు గుళికాకాలం మ. 12:01 నుండి మ. 1:24 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:50 నుండి తె. 5:38 వరకు అమృత ఘడియలు రా. 10:05 నుండి రా. 11:53 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:38 నుండి మ. 12:23 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

# యా.. అల్లాహ్!

## సౌదీ అరేబియాలో 45 మంది హైదరాబాదీలు బుగ్గి

### మృతుల్లో 18 మంది మహిళలు..

### 11 మంది చిన్నారులు

ఒకే కుటుంబానికి చెందిన 18 మంది దుర్మరణం



సౌదీ అరేబియాలో 45 మంది హైదరాబాదీలు సజీవ దహనమయ్యారు. మక్కా నుంచి మదీనాకు వెళ్తున్న యాత్రికుల బస్సు సౌదీలోని ముఫరహత్ ప్రాంతంలో డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. అకస్మాత్తుగా ప్రమాద స్థలిలో విస్ఫోటనంతో చావు కేకలు వినపడలేదు. కళ్లముందే గాఢనిద్రలోని యాత్రికులు సజీవ దహనం అయ్యారు.

రియాద్: భారత కాలమాన ప్రకారం సోమవారం తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో ఘోర ప్రమాదం జరిగింది. సౌదీ అధికారులు, సహాయక బృందాలు ప్రమాద స్థలికి హుటాహుటిన చేరుకున్నా ప్రయోజనం లేకపోయింది. మక్కా నుంచి మదీనా వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సౌదీ మీడియా ప్రకటించింది. మృతుల్లో 18 మంది మహిళలు, 11 మంది చిన్నారులు ఉన్నారని తెలిపింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి బయట పడ్డాడు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది ఉన్నారని తెలంగాణ హజ్ కమిటీ తెలిపింది. వీరిలో తొమ్మిది మంది పెద్దలు, తొమ్మిది మంది పిల్లలు ఉన్నారు. వీరంతా -2 వ పేజీలో...



# మమ్మల్నే.. ధిక్కరిస్తారా?

## అనర్హతపై నిర్ణయం తీసుకుంటారా?

## లేదా మా నిర్ణయాన్ని చెప్పమంటారా?

న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ ఎక్కడ జరుపుకుంటారో నిర్ణయించుకోండి
ఇది మాత్రం కచ్చితంగా కోర్టు ధిక్కరణే
వారంలో కోర్టుకు సమాధానం ఇవ్వాలి
తెలంగాణ స్పీకర్‌కు సుప్రీం అల్టిమేటం



ఎమ్మెల్యేల ఫిరాయింపు పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు శుక్రవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. నెలల తరబడి అనర్హత పిటిషన్లను పెండింగ్‌లో ఉంచినందుకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై కోర్టు ఘాటు వ్యాఖ్యలు చేస్తూ ధిక్కరణ నోటీసులు జారీ చేసింది.

న్యూఢిల్లీ: సుప్రీం కోర్టు స్పీకర్‌ను ఉద్దేశిస్తూ అనర్హతపై నిర్ణయం మీరు తీసుకుంటారా? మేం తీసుకోవాలా? అని తేల్చిచెప్పింది. అలాగే "నూతన సంవత్సరం సెలబ్రేషన్స్ స్పీకర్ ఎక్కడ జరుపుకోవాలనుకుంటారో ఆయనే నిర్ణయించాలి కానీ ఇది మాత్రం స్పష్టంగా కోర్టు ధిక్కారం" అని సీజేఐ అన్నారు. వారం రోజుల్లో కోర్టుకు సమాధానం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. అనర్హత పిటిషన్లపై రోజువారీ తరువాయి 2 వ పేజీలో...



# డిసెంబర్ రెండో వారంలో పల్లె ఓట్లు

## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం.. డిసెంబర్ 1-9 మధ్య ప్రజాపాలనోత్సవాలు

## ఆ వెంటనే ఎన్నికల నోటిఫికేషన్!.. సర్పంచ్ ఎన్నికలే ముందు: పొంగులేటి

హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలపై కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర మంత్రివర్గం సమావేశం అయ్యింది. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ కేబినెట్‌లో చర్చ జరిగింది. ఈ సందర్భంగా కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ రెండో వారంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. డిసెంబర్ 1 నుంచి డిసెంబర్ 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించాలని కేబినెట్‌లో నిర్ణయించారు. ప్రజాపాలనోత్సవాల తర్వాత ఈ ఎన్నికలు నిర్వహించాలని తరువాయి 2 వ పేజీలో...

# 50% మించొద్దు

## 'స్థానిక' రిజర్వేషన్లపై సుప్రీం స్పష్టీకరణ

లోకల్ బాడీ ఎన్నికల్లో రిజర్వేషన్లు ఎట్టిపరిస్థితుల్లో 50శాతం మించకూడదని సుప్రీం కోర్టు తేల్చిచెప్పింది. మహారాష్ట్రలో జరగనున్న లోకల్ బాడీ ఎన్నికల అంశంలో కోర్టు ఉత్తర్వును అధికారులు తప్పుగా అర్థం చేసుకున్నారని సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది.

న్యూఢిల్లీ: మహారాష్ట్ర స్థానిక ఎన్నికల అంశంపై సుప్రీంకోర్టు ఎట్టిపరిస్థితుల్లో రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని మించకూడదని జస్టిస్ సూర్యకాంతం, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికలెప్పుడూ చట్టానికనుగుణంగానే జరగాలనే అయితే రిజర్వేషన్ల పరిధి 50 శాతం మించకూడదని చట్టంలో స్పష్టంగా ఉందని కోర్టు తెలిపింది. స్థానిక ఎన్నికల విషయంలో రిజర్వేషన్ల పరిమితి అంశాన్ని తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్): | రూ.12,540 |
| వెండి (గ్రాము): | రూ.173 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,403 |



# కులం, మతం అంటే ఓట్లు రావు

## తెలంగాణలో డివిజన్ పాలిటిక్స్ అసాధ్యం

## అభ్యర్థి ప్రకటన ఆలస్యం వల్లే 'జూబ్లీ' ఓటమి

## ఎంపీ ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు

'ప్రజలకు ఇప్పటి వరకు ఏం చేశాం.. ఇక ముందు ఏం చేస్తావు అని చెప్పి ప్రజలను ఓట్లు అడగాలి. కులం, మతం పునాదిమీద రాజకీయాలు శాశ్వతంగా నడవవు అనేది నా వ్యక్తిగత అభిప్రాయం. మాది ప్రజాస్వామిక పార్టీ అందుకే గుజరాత్ లో ఇన్నేళ్లుగా పాలన నడుస్తుంది' అని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుపై బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సోమవారం స్పందించారు.

హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): ఉపఎన్నికల్లో అధికార పార్టీ గెలవడం సహజం అని ఇది తన వ్యక్తిగత అభిప్రాయం అని చెప్పుకొచ్చారు. 'అభివృద్ధితో పాటు భారత ఆత్మగౌరవం నిలబెట్టడం వల్లనే బీజేపీకి ప్రజలు పట్టం కడుతున్నారు. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో దేశం అగ్రభాగాన నిలబడింది. 50 శాతం కంటే ఎక్కువ ముస్లిం జనాభా ఉన్న నియోజకవర్గంలో 25 ఏళ్ల మైథిలీ ఠాగూర్ విజయం సాధించింది అంటే అర్థం తరువాయి 2 వ పేజీలో...



# షేక్ హసీనాకు ఉరి శిక్ష


## బంగ్లాదేశ్ ఐసీటీ తీర్పు

## 1400 మంది చావుకు కారణమయ్యారని వెల్లడి

గత ఏడాది జరిగిన ప్రభుత్వ వ్యతిరేక నిరసనలపై ఘోరమైన అణచివేతకు పాల్పడ్డారంటూ బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఇంటర్నేషనల్ క్రైమ్ ట్రిబ్యునల్ మరణశిక్ష విధించింది. ఆమె అమానవీయ నేరాలకు పాల్పడ్డారని కోర్టు నిర్ధారిస్తోందని పేర్కొంటూ దోషిగా తేల్చింది.

ఢాకా: అమానవీయ నేరాలకు పాల్పడినట్లు నిర్ధరిస్తూ ఆమెను దోషిగా తేల్చింది. ఆమెతో పాటు అప్పటి హోం మంత్రి, పోలీస్ చీఫ్‌కూ శిక్ష విధించింది. నిరసనకారులపై ప్రాణాంతక దాడులు జరిపినందుకు, వారిపై జరిగిన అణిచివేత చర్యలను అడ్డుకోనందుకు దోషులుగా నిర్ధారించింది. 2024లో ఆ దేశంలో రిజర్వేషన్ల కోటా వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన విద్యార్థి నేతృత్వంలోని తిరుగుబాటును అణిచివేసేందుకు షేక్ హసీనా ఆదేశాలు జారీ చేశారనే ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఈ విచారణను ప్రారంభించారు. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం.. ఈ అణచివేతలో సుమారు 1400 మంది ప్రాణాలు తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



కొందరికి దగ్గర చూపు సరిగా ఉండదు. దగ్గర ఉండే వస్తువులు మసకగా కనిపిస్తాయి. అయితే, వారికి ఉపశమనం కలిగించే న్యూస్ చెప్పారు శాస్త్రవేత్తలు. రీడింగ్ గ్లాసెస్ అవసరం లేకుండానే, దగ్గర చూపును స్పష్టంగా చూసేలా చేసే కంటి చుక్కలను తయారుచేశామని వెల్లడించారు. 'విజ్' ఐ డ్రాప్స్‌ను రోజుకు ఒక్కసారి వేసుకుంటే చాలు.. రోజంతా దగ్గరి చూపు సమస్య ఉండదు.

# రవిది క్రిమినల్ మైండ్

## పైరసీ ముసుగులో బెట్టింగ్స్ యాప్స్.. హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడి

తెలుగు సినిమా పరిశ్రమకు ఏళ్లుగా కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న 'ఐబొమ్మ' పైరసీ వెబ్‌సైట్ అడ్డంకి తొలగిపోయింది. ఈ వెబ్‌సైట్ ప్రధాన సూత్రధారి ఇమ్మడి రవి అరెస్ట్ కావడంతో ఇండస్ట్రీ ఊపిరి పీల్చుకుంది. ఈ కీలక పరిణామం నేపథ్యంలో, సోమవారం మెగాస్టార్ చిరంజీవి, కింగ్ నాగార్జున, నిర్మాత దిల్ రాజు.. హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ బీసీ సజ్జనార్‌తో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): ఈ సమావేశంలో ఐబొమ్మ అంశంపైనే ప్రధానంగా చర్చ జరిగింది. అనంతరం సీపీ సజ్జనార్ మీడియా సమావేశం నిర్వహించారు. 'పైరసీ అనేది దేశవ్యాప్త సమస్య. దీనివల్ల సినీ పరిశ్రమకు వేల కోట్ల నష్టం వాటిల్లింది. ఎంతో శ్రమించి ప్రధాన సూత్రధారి ఇమ్మడి రవిని ఎట్టకేలకు పట్టుకున్నాం' అని సజ్జనార్ వెల్లడించారు. ఇమ్మడి రవి కార్యకలాపాల గురించి సీపీ సజ్జనార్ వివరిస్తూ, 'రవి కేవలం టాలీవుడ్ మాత్రమే కాదు, బాలీవుడ్‌కు చెందిన సినిమాలను పైరసీ చేశాడు. అతని నుంచి 3 కోట్ల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నాం' అని తెలిపారు. అంతేకాదు, విచారణలో రవి సుమారు 20 కోట్ల వరకు సంపాదించినట్లు అంగీకరించాడని కూడా సజ్జనార్ తరువాయి 2 వ పేజీలో...



iBOMMA

# మీకు ఐబొమ్మ గుడ్‌బై!

ఇండియాలో శాశ్వతంగా మూసేస్తున్నాం

వెబ్‌సైట్‌లో ప్రత్యక్షమైన సందేశం

## రాశి ఫలాలు

18.11.2025

మేషం: సన్నిహితులతో శుభకార్యాల్లో పాల్గొంటారు. సంతాన విద్యా ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారాలు గతం కంటే పుంజుకుంటాయి. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. అధికారులతో చర్చలకు అనుకూల సమయం. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది.

వృషభం: సోదరులతో ఆస్తి వివాదాలు పరిష్కారం అవుతాయి. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. నూతన వాహన యోగం ఉన్నది. వ్యాపార, ఉద్యోగాలు ఉత్సాహంగా సాగుతాయి. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థిక పరిస్థితి మరింత మెరుగ్గా ఉంటుంది.

మిధునం: ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి కొంత నిరాశ పరుస్తుంది. సన్నిహితులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

కర్కాటకం: కొన్ని వ్యవహారాలలో శిరో బాధలు తప్పవు. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. బంధుమిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగమున స్థానచలన సూచనలు ఉన్నవి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి.

సింహం: గృహమున కొన్ని సంఘటనలు ఆశ్చర్యపరుస్తాయి. నూతన వ్యక్తుల పరిచయం ఉత్సాహాన్నిస్తుంది. నిరుద్యోగులకు ఉద్యోగయోగం ఉన్నది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగులకు హెూదాలు పెరుగుతాయి. చిన్ననాటి మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి.

కన్య: నిరుద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. చేపట్టిన పనులు వ్యయ ప్రయాసలతో గాని పూర్తి కావు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఉద్యోగాలలో బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో సరైన సమయానికి నిర్ణయాలు తీసుకోక నష్టాలు ఎదుర్కొంటారు.

తుల: వ్యాపారాలు మరింత లాభసాటిగా సాగుతాయి. ఇంటా బయట సఖ్యతగా వ్యవహరిస్తారు. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. కీలక సమయంలో సన్నిహితులు సాయం అందిస్తారు.

వృశ్చికం: కుటుంబ సభ్యులతో కొద్దిపాటి వివాదాలు తప్పవు. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఇంటాబయట చికాకులు అధికమవుతాయి. స్వంత ఆలోచనలలో నిలకడ లోపిస్తుంది. వ్యాపారాలలో భాగస్వాములతో బేధాభిప్రాయాలు కలుగుతాయి.

ధనస్సు: ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. సంఘంలో మరింత గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో సమయానికి నిర్ణయాలు తీసుకుని లాభాలను అందుకుంటారు. నూతన పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తారు.

మకరం: దూరప్రాంతాల నుంచి శుభవార్తలు అందుతాయి. రాజకీయ ప్రముఖులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. వ్యాపారాలు ఆశించిన విధంగా రాణిస్తాయి. ఉద్యోగమున మీప్రతిభ వెలుగులోకి వస్తుంది. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. బంధు మిత్రులతో ఆలయ దర్శనాలు చేసుకుంటారు.

కుంభం: దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. ఆరోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో వివాదాలు తప్పవు. చేపట్టిన పనులలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. ముఖ్యమైన పనులు కొన్ని వాయిదా వేస్తారు.

మీనం: ఉద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. దీర్ఘకాలిక రుణాలు తీర్చడానికి నూతన ఋణప్రయత్నాలు చేస్తారు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగస్తులకు ఆకస్మిక స్థానచలన సూచనలు తప్పవు. చేపట్టిన పనులలో ఆటంకాలు ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో ఎంతగా కష్టపడ్డా ఫలితం ఉండదు.

# యా.. అల్లాహ్!

తరువాయి 2 వ పేజీలో...

విశ్రాంత రైల్వే ఉద్యోగి నసీరుద్దీన్ కుటుంబానికి చెందినవారు. నసీరుద్దీన్.. తన కుటుంబ సభ్యులతో కలిసి 8 రోజుల క్రితం మక్కా యాత్రకు వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం సంభవించింది. విషయం తెలుసుకున్న బాధిత బంధుమిత్రులు రామ్‌నగర్‌లోని నసీరుద్దీన్ ఇంటికి చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. బాధిత సభ్యులతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడారు. వారికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఇప్పటికే ఆ దిశగా చర్యలు ముమ్మరం చేసినట్టు ఆయన వెల్లడించారు. ఎలాంటి అవసరమున్నా తక్షణమే తనను సంప్రించాలని వారికి చెప్పారు. ఒకే కుటుంబంలో ఇంత మంది చనిపోవడం నమ్మశక్యంగా లేదంటూ నసీరుద్దీన్ బంధుమిత్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

### ప్రమాదం జరిగిందిలా..

సోమవారం తెల్లవారుజామున మక్కాలో ఉమ్రా యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని, మదీనా నగరానికి బస్సులో బయలుదేరారు. మదీనా నగరానికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉండగా, వీరు ప్రయాణిస్తున్న బస్సు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఓ డీజిల్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం. ఈ భయానక ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న మొత్తం 45 మంది అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఈ ప్రమాదంలో మరణించిన వారిలో 18 మంది హైదరాబాద్ విద్యానగర్‌కు చెందిన ఒకే కుటుంబ సభ్యులు కావడం ఈ విషాద తీవ్రతను రెట్టింపు చేసింది. రిటైర్డ్ రైల్వే ఉద్యోగి అయిన నజీరుద్దీన్, తన కుటుంబ సభ్యులందరితో కలిసి ఈ యాత్రకు వెళ్లారు. మక్కాలో ప్రార్థనలు ముగించుకుని మదీనాకు వెళ్లే మార్గమధ్యంలో వారి కుటుంబంపై విధి ఇలా పగబట్టింది.

### భారత్ దర్యాప్తు

ఈ యాత్రను హైదరాబాద్‌కు చెందిన నాలుగు ట్రావెల్ ఏజెన్సీలు నవంబర్ 9వ తేదీన ఏర్పాటు చేశాయి. ప్రమాద వార్త తెలియగానే సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. సౌదీ అధికారులు ఈ ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఈ విషాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి, పలువురు కేంద్ర మంత్రులు తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### ఎంపీ అసదుద్దీన్ దిగ్ర్భాంతి

బస్సు ప్రమాదంపై హైదరాబాద్ ఎంపీ, ఏఐఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉమ్రా యాత్రలో భాగంగా మక్కా యాత్ర ముగించుకుని మదీనా వెళ్తుండగా ఈ బస్సు ప్రమాదం జరిగిందని తెలిపారు. రెండు ట్రావెల్ ఏజెన్సీల ద్వారా యాత్రికులు ఉమ్రా యాత్రకు వెళ్ళినట్లు తెలిసింది అని అన్నారు. రియాద్‌లోని ఇండియన్ ఎంబసీ అబు మాథేన్ జార్జ్‌తో మాట్లాడినట్లు తెలిపారు. సౌదీ అరేబియాలో నివసిస్తున్న భారతీయులు, ఇతరుల నుంచి సమాచారం సేకరిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వాలు ప్రమాదంపై దృష్టి సారించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

### మృతుల కుటుంబాలకు 5 లక్షలు

బస్సు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం రూ. 5 లక్షల పరిహారం అందజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మంత్రి వర్గం తీర్మానించింది. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ఈ ఘటనపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. ప్రభుత్వ ప్రతినిధి బృందంగా మంత్రి అజారుద్దీన్, మజ్లిస్ ఎమ్మెల్యే, మరియు మైనార్టీ విభాగానికి చెందిన ఒక అధికారి వెంటనే సౌదీ అరేబియాకు వెళ్లాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. మరణించిన వారి కుటుంబ సభ్యుల అభీష్టం మేరకు మృతదేహాలను అక్కడే మత సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించడానికి, ఒక్కో బాధిత కుటుంబం నుంచి ఇద్దరు కుటుంబ సభ్యులను సౌదీ అరేబియాకు తీసుకువెళ్లడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# కులం, మతం అంటే ఓట్లు రావు

తరువాయి 2 వ పేజీలో...

చేసుకోండి. అభివృద్ధి సంక్షేమం అందరికీ అందుతుంది తప్ప ఒక వర్గానికి కాదు. బీహార్ ఎన్నికలు ఒక ప్రభంజనం. ఒళ్ళు వంచి పని చేస్తే విజయం మనదే. కార్యకర్తలు నాయకులు సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు చూసి బాధపడకండి. భవిష్యత్తు మనదే. గెలిచిన ఓడినా.. అధికారం ఉన్నా లేకపోయినా దశాబ్దాలుగా కాషాయ జండా పట్టుకుని ప్రజల కోసం పనిచేస్తున్న పార్టీ భారతీయ జనతా పార్టీ. వేలాది మంది బీజేపీ కారకర్తలు, వందలమంది నాయకుల భవిష్యత్తు కోసం మాట్లాడుతున్నా. సీఎం, మంత్రులు, కొంతమంది అవగాహన లేని నాయకులు మాట్లాడుతున్న మాటలు వింటున్నా. ఒకటి అర్థం చేసుకోవాలి. నారాయణఖేడ్, పాలేరులో, హుజూర్‌నగర్‌లో, నాగార్జున సాగర్, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ అన్నిటిలో అధికార పార్టీ గెలిచింది' అని కార్యకర్తల్లో భరోసా నింపారు.

### దుబ్బాక, హుజూరాబాద్‌లో బీజేపీ గెలుపు

'కేసీఆర్ అహంకారం అణచివేయడానికి దుబ్బాకలో బీజేపీని గెలిపించారు. అన్యాయానికి-న్యాయానికి, ఆత్మగౌరవానికి-అహంకారానికి, ధర్మానికి-అధర్మానికి జరిగిన హుజురాబాద్ ఎన్నికల్లో ధర్మం గెలిచింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరూ ఆ ఎన్నిక కోసం ఎదురుచూశారు. స్వయంగా కేసీఆర్ వచ్చి దళిత బంధు ప్రకటించినా గెలవలేక పోయారు' అని గుర్తుచేశారు. 'తెలంగాణ వచ్చిన తరువాత 9 ఉప ఎన్నికలు జరిగితే 7 సార్లు అధికార పార్టీనే గెలిచింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లో కాంగ్రెస్‌నే గెలిచింది. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో అధికార పార్టీ అనేక ప్రలోభాలు పెట్టి మరీ గెలిచింది. కేసీఆర్ ఎన్ని చేశారో వీళ్లు కూడా అవే చేశారు' అని తెలిపారు. 'కాంగ్రెస్‌కి హుజురాబాద్‌లో వచ్చిన ఓట్లు 3016. దుబ్బాకలో, మునుగోడు డిపాజిట్ కోల్పోయింది. మరి డిపాజిటు కోల్పోయిన పార్టీ మొన్న ఎలా అధికారంలోకి వచ్చింది. ఒక్క బై ఎలక్షన్ ఓడిపోగానే బీజేపీ పని అయిపోతుందా?' అని ఈటల అన్నారు. 'రాజకీయ పరిజ్ఞానం ఉన్న వారు ఎవరూ అలా మాట్లాడరు. జూబ్లీహిల్స్ ఎన్నిక ఫలితం అందరం బాధ్యత తీసుకుంటున్నాం. ప్రజలకు సేవ చేయడం వల్లనే దేశ వ్యాప్తంగా బీజేపీకి ప్రజలు ఓట్లు వేస్తున్నారు. గెలిస్తే బీజేపీ వాళ్ళు ఈవీఎంలను ఏదో చేశారని అంటున్నారు. మరి జూబ్లీహిల్స్‌లో ఈవీఎం మేనేజ్ చేశారా ?. దొంగఓట్లు నమోదు చేయించారా? పార్టీ అంటే నాయకులు అందరూ బాధ్యత తీసుకుంటారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డినో ఇంకొకరినో బాధ్యులు చెయ్యలేం. జూబ్లీహిల్స్‌లో ఎమ్మెల్యే చనిపోయిన వెంటనే బీజేపీ తిరిగి ఉంటే ఫలితం వేరుగా ఉండేది. ఒకాయన అధికారం పోతుంది అని ఇంకొకరు సానుభూతితో పోటీ పడ్డారు' అని పేర్కొన్నారు.

# మమ్మల్నే..ధిక్కరిస్తారా

మొదటి పేజీ తరువాయి

విచారణ జరపాలని సీజేఐ సూచించారు. జూలైలో భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ ప్రకారం.. అనర్హత ప్రక్రియను పూర్తి చేయడానికి స్పీకర్‌కు మూడు నెలల సమయం ఇచ్చింది. అయితే అధికార కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన 10 మంది భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లపై నిర్ణీత సమయంలోగా నిర్ణయం తీసుకోనందుకు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సుప్రీంకోర్టు సోమవారం ధిక్కార నోటీసు జారీ చేసింది. స్పీకర్ కార్యాలయం తరపున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, అభిషేక్ సింఘ్వి, న్యాయవాది శ్రావణ్ కుమార్ లు హాజరై, నాలుగు కేసుల్లో విచారణలు ఇప్పటికే పూర్తయ్యాయని, మరో మూడు కేసుల్లో సాక్ష్యాల నమోదు ముగిసిందని వాదించారు. అయితే, 'దీనిని ముగించి ఉండాలి. ఇది అత్యంత దారుణమైన ధిక్కారం. నూతన సంవత్సరాన్ని ఎక్కడ జరుపుకోవాలో ఆయనే నిర్ణయించుకోవాలి' అని అన్నారు. అయితే, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు స్పీకర్, ఇతర అధికారులను వ్యక్తిగత హాజరు నుండి ధర్మాసనం మినహాయించింది. నాలుగు వారాల తర్వాత తదుపరి విచారణకు వాయిదా వేసింది. కోర్టు అసంతృప్తిని స్పీకర్‌కు వ్యక్తిగతంగా తెలియజేస్తానని రోహత్గి ధర్మాసనానికి హామీ ఇచ్చారు.

### పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు:

దానం నాగేందర్ (ఖైరతాబాద్), కడియం శ్రీహరి (స్టేషన్‌ఘన్‌పూర్), పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ), తెల్లం వెంకట్‌రావు (భద్రాచలం), ఎం సంజయ్‌కుమార్ (జగిత్యాల్), ఆరెకపూడి గాంధీ (సిరిలింగంపల్లి), టీ ప్రకాష్‌గౌడ్ (రాజేంద్రనగర్), బీ కృష్ణమోహన్‌రెడ్డి (గద్వాల్), గత్లె యాచెర్లరెడ్డి (చేవెళ్ల).

# డిసెంబర్ రెండో వారంలో పల్లె ఓట్లు

మొదటి పేజీ తరువాయి

నిర్ణయించింది. ఈ కార్యక్రమాల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తానికి డిసెంబర్‌లో ఈ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల అవకాశం కనిపిస్తుంది.

### సర్పంచ్ ఎన్నికలే ముందు: పొంగులేటి

స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించి ఆ తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తొలుత సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చిత్తశుద్ధితో భావించామని, రాష్ట్రపతి దగ్గర బీసీ రిజర్వేషన్ బిల్లు ఆగిపోయిందని అన్నారు. రాష్ట్రంలో మొదట సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టత ఇచ్చారు. పార్టీపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపారు. మిగిలిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు అన్ని కూడా కోర్టు తీర్పు తర్వాత నిర్వహిస్తామని అన్నారు. గిగ్ వర్కర్ల బిల్లుకూ కేబినెట్ ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. పాఠ్య పుస్తకాల్లో అందెశ్రీ గేయాన్ని చేర్చాల్సిన నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

### నోటిఫికేషన్ రిలీజ్ అయ్యాక వాయిదా

వాస్తవానికి తెలంగాణలోని స్థానిక సంస్థల పదవీకాలం ఇప్పటికే ముగిసింది. దాదాపు 20 నెలలుపైగా కావస్తోంది. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణ అనివార్యంగా మారింది. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించి ఈసీ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే రిజర్వేషన్ల పెంపు సరికాదంటూ హైకోర్టు ఆ నోటిఫికేషన్‌ను కొట్టేసింది. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు ఇటీవల ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లను పెంచుతూ ఆర్డినెన్స్ జారీ చేసింది. దీనికి అనుగుణంగా ఎన్నికల సంఘం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే రిజర్వేషన్లు 50శాతానికి మించడానికి వీలు లేదంటూ హైకోర్టు వాటిని కొట్టేసింది. హైకోర్టు నిర్ణయంతో స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్ పడింది. మరోవైపు నవంబర్ 24లోగా ఎన్నికల నిర్వహణపై స్పష్టత ఇవ్వాలని హైకోర్టు ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో కేబినెట్ డిసెంబర్ 9 తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అన్నీ కలిసి వస్తే డిసెంబర్‌లో స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల అవడం ఖాయంగా తెలుస్తోంది.

# మీకు ఐబొమ్మ గుడ్‌బై!

**ఇండియాలో శాశ్వతంగా మూసేస్తున్నాం.. వెబ్‌సైట్‌లో ప్రత్యక్షమైన సందేశం**

iBOMMA

హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): ఐబొమ్మ, బప్పం టీవీ నిర్వాహకుడు ఇమ్మడి రవిని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసింది. నిన్న ఒక అడుగు ముందుకు వేసి, అతని చేతనే ఆ వెబ్‌సైట్లను మూయించేశారు పోలీసులు. అయితే, తాజాగా ఐబొమ్మ వెబ్‌సైట్ తెరిచిచూడగా 'మీరు ఇటీవల మా గురించి విని ఉండవచ్చు, లేదా.. ఎప్పటినుంచో మా సేవలను వినియోగిస్తున్న వారై ఉండవచ్చు. కానీ మీకు ఒక చెడు వార్త చెప్పాల్సి వస్తోంది. మీ దేశంలో మేము పర్మనెంట్‌గా ఈ సేవలను నిలిపివేస్తున్నాం. దయచేసి మీకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం' అని పేర్కొంది.

# 50% మించొద్దు

మొదటి పేజీ తరువాయి

అధికారులు తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపింది. బాంథియా కమిషన్ నివేదికకు ముందు ఉన్న రిజర్వేషన్ల ఆధారంగానే ఎన్నికలు నిర్వహించాలని మే6న ఆదేశించిన విషయంఈ సందర్భంగా సుప్రీం కోర్టు గుర్తు చేసింది.

# రవిది క్రిమినల్ మైండ్

మొదటి పేజీ తరువాయి

చెప్పడం అందరినీ షాక్‌కు గురిచేసింది. ఈ కేసులో మరో భయంకరమైన కోణం కూడా బయటపడింది. ఇమ్మడి రవి వద్ద ఏకంగా 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా ఉందని, ఆ డేటాను డార్క్ వెబ్‌లో అమ్మడం ద్వారా దుర్వినియోగం చేసే ప్రమాదం కూడా ఉండేదని సజ్జనార్ హెచ్చరించారు. పైరసీ ముసుగులోనే రవి, ఎంతో మంది యువకుల ప్రాణాలు తీసిన, కుటుంబాలను నాశనం చేసిన బెట్టింగ్ యాప్స్‌ను కూడా ప్రమోట్ చేసినట్లు ఆయన తెలిపారు. రవి నేర చరిత్ర గురించి వివరిస్తూ, 'అతనికి ముందు నుంచే క్రిమినల్ మైండ్ ఉంది. మహారాష్ట్రలో ప్రహ్లాద్ పేరుతో నకిలీ డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్ సృష్టించుకున్నాడు' అని అన్నారు. అంతేకాదు, పోలీసులకు దొరకకుండా ఉండేందుకు ఏకంగా కరేబియన్ ఐలాండ్స్ పౌరసత్వం తీసుకున్నాడని, ఫ్రాన్స్, దుబాయ్, థాయిలాండ్ దేశాలు తిరుగుతూ, అమెరికా, నెదర్లాండ్స్‌లో సర్వర్లు పెట్టి ఈ రాకెట్‌ను నడిపించాడని సీపీ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం 5 కేసులు నమోదు చేశామని, దుద్దెల శివరాజ్, ప్రశాంత్ అనే మరో ఇద్దరిని ఇదివరకే అరెస్ట్ చేశామని సజ్జనార్ తెలిపారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఇంకా పెద్ద రాకెట్ ఉందని, దీనిపై లోతుగా దర్యాప్తు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

# షేక్ హసీనాకు ఉరి శిక్ష

తరువాయి 2 వ పేజీలో...

కోల్పోయారు. కాగా, షేక్ హసీనాకు మరణశిక్ష విధించిన తర్వాత కోర్టు లోపల, వెలుపల ప్రజలు సంబరాలు చేసుకున్నారు. కొందరు షేక్ హసీనాను ఉరితీయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. కొన్ని సెకన్ల పాటు కొందరు సంబరాలు చేసుకున్న తర్వాత కోర్టు మర్యాద పాటించాలని కోర్టు విజ్ఞప్తి చేసింది. బంగ్లాదేశ్‌లో ముఖ్య సలహాదారు మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఈ తీర్పును చారిత్రక తీర్పుగా అభివర్ణించింది. బంగ్లాదేశ్, భారత్‌ల మధ్య ఉన్న ప్రత్యర్పణ ఒప్పందం ప్రకారం షేక్ హసీనా, అసదుజ్జమాన్ ఖాన్‌లను వెంటనే అప్పగించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం భారత ప్రభుత్వాన్ని కోరింది. అంతకుముందు చేసిన ఇవే డిమాండ్‌లకు కూడా భారత్ అధికారికంగా ఎలాంటి స్పందన ఇవ్వలేదని పేర్కొంది.

### రాజకీయ ప్రేరేపిత తీర్పు: షేక్ హసీనా

ప్రస్తుతం భారత్‌లో ఉన్న షేక్ హసీనా ఢాకా కోర్టు తీర్పును ఖండించారు. 'ఇది పక్షపాతపూరితం, రాజకీయ ప్రేరేపితం'గా పేర్కొన్నారు. కోర్టు తీర్పు తర్వాత ఆమె ఐదుపేజీల ప్రకటన విడుదల చేశారు. మరణశిక్ష విధించడం.. తన పార్టీ అవామీలీగ్‌ను రాజకీయంగా పూర్తిగా నిర్మూలించేందుకు తాత్కాలిక ప్రభుత్వానికి ఒక మార్గంగా హసీనా పేర్కొన్నారు. 'సాక్ష్యాలను న్యాయంగా పరిశీలించి, విచారణ జరిపే సరైన కోర్టులో నాపై ఆరోపణలు చేసిన వారిని ఎదుర్కొనేందుకు నాకెలాంటి భయం లేదు' అని హసీనా అన్నారు. ఈ ఆరోపణలను హేగ్‌లోని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు దృష్టికి తీసుకెళ్లాలని తాత్కాలిక ప్రభుత్వాన్ని ఆమె సవాల్ చేశారు. మానవ హక్కులు, అభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వానికున్న రికార్డు చూసి గర్వపడుతున్నానని వెల్లడించారు. గత ఏడాది బంగ్లాదేశ్‌లో విద్యార్థి ఆందోళనల తర్వాత ఆమె ప్రభుత్వం కూలిపోవడంతో ప్రస్తుతం షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు.

### బంగ్లా ప్రజల ప్రయోజనాలకు కట్టుబడి ఉంటాం: భారత్

షేక్ హసీనా మరణశిక్ష అంశంపై తాజాగా భారత ప్రభుత్వం స్పందించింది. బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలకు భారత్ కట్టుబడి ఉంటుందని వెల్లడించింది. అదే సమయంలో షేక్ హసీనాను తిరిగి బంగ్లాదేశ్‌కు అప్పగించాలని అక్కడి తాత్కాలిక ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిపై మాత్రం భారత్ ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. బంగ్లాదేశ్ మాజీ ప్రధానికి మరణ శిక్ష విధించిన నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తాజాగా ఒక ప్రకటన విడుదల చేసింది. అయితే.. ఈ ప్రకటనలో హసీనాను అప్పగించాలనే బంగ్లాదేశ్ డిమాండ్‌పై ప్రత్యక్షంగా ప్రస్తావించలేదు. ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఆఫ్ బంగ్లాదేశ్.. షేక్ హసీనాకు సంబంధించిన తీర్పును భారత్ గమనించిందని తెలిపింది.

# హైదరాబాద్‌కు ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీ



**సీఎం రేవంత్ రెడ్డితో ఫ్రెండ్లీ మ్యాచ్!**

**డిసెంబర్‌లో మ్యాచ్ జరిగే ఛాన్స్: టీపీసీసీ చీఫ్**

హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): హైదరాబాద్ క్రీడాభిమానులకు శుభవార్త. ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీతో కలిసి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఫుట్‌బాల్ మైదానంలోకి అడుగుపెట్టే అరుదైన అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే, ఈ ఏడాది డిసెంబర్‌లో హైదరాబాద్ ఈ ప్రత్యేకమైన క్రీడా ఘట్టానికి వేదిక కానుంది. టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ ఈ విషయంపై కీలక సంకేతాలు ఇచ్చారు. మెస్సీ చేపట్టనున్న "గోట్ ఇండియా టూర్ 2025"లో భాగంగా హైదరాబాద్‌లో ఒక స్నేహపూర్వక మ్యాచ్ జరిగే అవకాశం ఉందని, అందులో సీఎం రేవంత్ రెడ్డి కూడా పాల్గొనవచ్చని ఆయన సూచించారు. ఈ వార్త తెలియగానే ఫుట్‌బాల్ అభిమానుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సీఎం రేవంత్ రెడ్డికి ఫుట్‌బాల్‌పై ఎప్పటినుంచో ఉన్న ఆసక్తి కారణంగా ఈ ప్రచారానికి మరింత బలం చేకూరుతోంది. సరూర్‌నగర్‌లో కరాటే ఫెడరేషన్ ఆఫ్ షోటోకాన్ ఇండియా నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ ఛాంపియన్‌షిప్-2025 ప్రెసిడెంట్స్ కప్ ముగింపు కార్యక్రమంలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. తెలంగాణను ప్రధాన క్రీడా కార్యక్రమాలకు నమ్మకమైన వేదికగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. క్రీడా సంఘాలకు ముఖ్యమంత్రి పూర్తి మద్దతు ఇస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా అథ్లెట్లకు అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తున్నారని వివరించారు. అనంతరం గచ్చిబౌలిలో జరిగిన ఎన్ఎస్ఎన్ కరాటే లీగ్ 2025 కార్యక్రమానికి కూడా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల్లో కరాటేకు ఆదరణ పెరుగుతోందని, ఇలాంటి పోటీలు క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు దోహదపడతాయని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు.



## వేల మంది కష్టాన్ని దోచేశాడు

**ఐబొమ్మ నిర్వాహకుడిపై చిరంజీవి ఆగ్రహం**

హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): తెలుగు సినీ పరిశ్రమకు కంటిమీద కునుకు లేకుండా చేసిన 'ఐబొమ్మ' పైరసీ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్ట్‌పై టాలీవుడ్ హర్షం వ్యక్తం చేసింది. ఈరోజు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ నిర్వహించిన మీడియా సమావేశంలో అగ్ర కథానాయకులు చిరంజీవి, నాగార్జున, దర్శకుడు రాజమౌళి, నిర్మాతలు సురేశ్‌బాబు, దిల్ రాజు తదితరులు పాల్గొన్నారు. పైరసీని అరికట్టడంలో తెలంగాణ పోలీసుల కృషిని మనస్ఫూర్తిగా అభినందించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. పైరసీ వల్ల సినీ పరిశ్రమ తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఎంతో కష్టనష్టాలకోర్చి సినిమాలు తీస్తుంటే, రవి లాంటి వాళ్లు వేలాది సినీ కుటుంబాల కష్టాన్ని దోచుకుంటున్నారు. కొన్ని వేల మంది కష్టాన్ని ఒక్కడు దోచుకోవడం సరికాదు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షిస్తేనే మరొకరు ఇలాంటి నేరాలు చేయడానికి భయపడతారు" అని అన్నారు. గతంలో సీవీ ఆనంద్, ఇప్పుడు సజ్జనార్ పైరసీపై యుద్ధంలో అండగా నిలిచారని చిరంజీవి ప్రశంసించారు. రెండు రోజుల క్రితం 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమ్మడి రవిని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అతడి నుంచి లాగిన్ వివరాలు తీసుకుని వెబ్‌సైట్‌ను బ్లాక్ చేయించారు. రవి బ్యాంకు ఖాతాల్లోని రూ.3 కోట్లకు పైగా నగదును సీజ్ చేయడంతో పాటు వందలాది హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు. న్యాయస్థానం అతడికి 14 రోజుల రిమాండ్ విధించడంతో ప్రస్తుతం నిందితుడు జైల్లో ఉన్నాడు. రవి అరెస్ట్‌తో తెలుగు సినీ పరిశ్రమ ఊపిరి పీల్చుకుంది.

## ఆటోడ్రైవర్లకు కేటీఆర్ రూ.5 లక్షల బీమా

సిరిసిల్ల, నవంబర్ 17 (ఈవార్తలు): ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి అసలు పట్టింపు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. సిరిసిల్లలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, డ్రైవర్ల భద్రత కోసం తమ పాలనలో తీసుకున్న చర్యలను గుర్తుచేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఆటోడ్రైవర్లకు రూ. 5 లక్షల విలువైన ప్రమాద బీమా సౌకర్యం అందించామని, దాని వల్ల అనేక కుటుంబాలు కష్టకాలంలో ఊరట పొందాయని ఆయన చెప్పారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పాలసీలను రిన్యూ చేయకపోవడంతో బీమా ప్రయోజనాలు రద్దయిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల భద్రత, సంక్షేమం వంటి మౌలిక అంశాల్లో ప్రభుత్వ నిర్లక్ష్యం అంగీకారయోగ్యం కాదని ఆయన పేర్కొన్నారు. డ్రైవర్లు తమ కుటుంబాల కోసం రోజూ శ్రమిస్తున్న క్రమంలో ప్రభుత్వం కనీస బీమా రక్షణకైనా ముందుకు రావాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలో ఉన్న దాదాపు 5 వేల మంది ఆటోడ్రైవర్లకు ప్రమాద బీమా తనే వ్యక్తిగతంగా చెల్లిస్తానని కేటీఆర్ ప్రకటించారు. ప్రభుత్వం తమ బాధ్యతను నిర్వర్తించకపోయినా, ఆటోడ్రైవర్ల భద్రత కోసం తానే ముందుకు వస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయం స్థానికంగా ఆటోడ్రైవర్లలో పెద్ద ఎత్తున హర్షం కలిగించినట్లు తెలుస్తోంది. డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పుడూ తమతో ఉంటానని కేటీఆర్ హామీ ఇచ్చారు.

## బీజేపీ ఓట్ చోరీ చేస్తోంది

**నిరసనలు తెలుపుతాం: పొన్నం**

గాంధీభవన్/హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): బీజేపీ అధికారంలోకి రావడానికి అనేక రకాలుగా ఓట్లు తొలగించి చోరీకి పాల్పడుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా ఓటు చోరీపై కాంగ్రెస్ పార్టీ నిరసనలు తెలపనున్నట్లు చెప్పారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా గాంధీభవన్‌లో తెలంగాణ యువజన కాంగ్రెస్ మహా నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నంతోపాటు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ యూత్ కాంగ్రెస్ సైనికులుగా మారి ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి శక్తివంతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. దేశవ్యాప్తంగా ఓటుచోరీపై నిరసనలు ఉద్ధృతం చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఇంటింటికి తీసుకెళ్లాలని చెప్పారు. అలాగే, సౌదీ బస్సు ప్రమాదంలో మృతి చెందిన యాత్రికులకు యూత్ కాంగ్రెస్ నివాళులర్పించింది.



## ఆరు నెలల కనిష్ఠానికి బిట్‌కాయిన్

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ అయిన బిట్‌కాయిన్ సోమవారం భారీగా పతనమైంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వచ్చే నెలలో వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు బలహీనపడటంతో, ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. దీంతో బిట్‌కాయిన్ ధర ఆరు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ట్రేడింగ్‌లో ఒక దశలో 92,971 డాలర్ల వద్దకు పడిపోయిన బిట్‌కాయిన్, ప్రస్తుతం 0.5 శాతం నష్టంతో 95,165 డాలర్ల వద్ద కదలాడుతోంది. గత ఏడు రోజుల్లోనే బిట్‌కాయిన్ 10 శాతానికి పైగా నష్టపోయింది. వరుసగా మూడో వారం కూడా నష్టాలను నమోదు చేసింది. ఈ ఏడాది ఆరంభం నుంచి సాధించిన 30 శాతం లాభాలను ఈ పతనం తుడిచిపెట్టింది. అక్టోబర్‌లో 1,26,000 డాలర్ల రికార్డు స్థాయిని తాకిన ఈ క్రిప్టో కరెన్సీ, ఇప్పుడు అధికారికంగా బేర్ మార్కెట్‌లోకి ప్రవేశించింది. బిట్‌కాయిన్‌తో పాటు ఇతర ప్రధాన కాయిన్లయిన ఇథీరియం, సొలానా, డోజీకాయిన్ కూడా నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి. అయితే, ఎక్స్ఆర్‌పీ మాత్రం స్వల్పంగా లాభపడింది. యూఎస్‌లో ద్రవ్యోల్బణ భయాలు మళ్లీ పెరగడం, ఫుడ్ ధరలను అదుపు చేసేందుకు సుంకాల కోతపై అధ్యక్షుడు ట్రంప్ సంకేతాలు ఇవ్వడం వంటి అంశాలు మార్కెట్‌ను ప్రభావితం చేశాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ముద్రెక్స్ సీఈఓ ఎడుల్ పటేల్ మాట్లాడుతూ "ధర తగ్గిన ప్రతీసారి పెద్ద ఇన్వెస్టర్లు (వేల్స్) కొనుగోలు చేస్తుండటం సానుకూల అంశం. 92,700 డాలర్ల వద్ద కొత్త మద్దతు ఏర్పడుతోంది" అని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో లిక్విడిటీ తక్కువగా ఉందని, ఇన్‌స్టిట్యూషనల్, రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి ఆసక్తి కరువైందని పై42 సీఈఓ అవినాశ్ శేఖర్ అన్నారు. "ఇలాంటి పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు ఓపికతో వ్యవహరించాలి. రికవరీ నెమ్మదిగా, అసమానంగా ఉంటుంది" అని ఆయన సూచించారు.

## ప్రైవేట్ బ్యాంకు పెట్టి మోసం

**ఆల్ ఫలాహ్ వర్సిటీ చైర్మన్ సోదరుడి అరెస్టు**

**మధ్యప్రదేశ్‌లోని మహూ ప్రాంతంలో ఆర్థిక మోసం**

**హైదరాబాద్‌లో అరెస్టు చేసిన మధ్యప్రదేశ్ పోలీసులు**

హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో కారు పేలుడు కేసులో విచారణ ఎదుర్కొంటున్న అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయం చైర్మన్ జావెద్ సిద్ధిఖీ సోదరుడు హమూద్ అహ్మద్ సిద్ధిఖీని మధ్యప్రదేశ్ పోలీసులు హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. 25 ఏళ్ల క్రితం మధ్యప్రదేశ్‌లోని మహూ ప్రాంతంలో జరిగిన ఆర్థిక మోసం కేసులో అతడిని అరెస్టు చేశారు. మహు ప్రాంతంలో 25 ఏళ్ల క్రితం అతను ఒక ప్రైవేటు బ్యాంకును స్థాపించి డిపాజిటర్లను మోసం చేశాడు. ఈ బ్యాంకులో డబ్బులు డిపాజిట్ చేస్తే రెట్టింపు చేస్తామని చెప్పడంతో వందలాది మంది ప్రజలు డబ్బులు డిపాజిట్ చేశారు. ఈ కుంభకోణం బయటపడటంతో 2000వ సంవత్సరంలో కుటుంబంతో సహా మహూ నుంచి పరారయ్యాడు. అప్పటి నుంచి అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. హమూద్‌ను హైదరాబాద్‌లో అరెస్టు చేశామని మహూ సబ్ డివిజనల్ ఆఫీసర్ ఆఫ్ పోలీస్ లలిత్ సింగ్ సికర్వార్ తెలిపారు. అతడు లో-ప్రొఫైల్‌లో జీవిస్తూ షేర్ ట్రేడింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. ఢిల్లీ పేలుడు నేపథ్యంలో జావెద్ సిద్ధిఖీ పూర్వాపరాలను పోలీసులు పరిశీలిస్తున్న సమయంలో అతని సోదరుడు హమూద్‌పై చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసు బయటకు వచ్చింది.

## 25న మరోసారి కేబినెట్ భేటీ

హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): ఈనెల 25న మరోసారి సమావేశం కావాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. 50 శాతం రిజర్వేషన్‌పై నివేదిక ఇవ్వాలని డెడికేషన్ కమిషన్‌కు సిఫార్సు చేశారు. డెడికేషన్ కమిషన్ నివేదికను మళ్లీ కేబినెట్‌లో పెట్టి చర్చించనున్నారు. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నారు. తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్ల బిల్లుకు కేబినెట్ ఆమోదించారు. అంతేకాకుండా గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమం బిల్లుకు కేబినెట్ ఆమోదించిందన్నారు. కవి అందెశ్రీ కుటుంబానికి అండగా ఉండాలని నిర్ణయించారు. ఆయన కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు హైదరాబాద్‌లో అందెశ్రీ స్మృతి వనం ఏర్పాటు, పాఠ్య పుస్తకాల్లో అందెశ్రీ రాసిన తెలంగాణ గీతం పెట్టాలని నిర్ణయించారు.

# ఆరోగ్యశాఖలో కొలువుల పండుగ

**పూర్తయిన ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ**

**1284 మందికి ఉద్యోగాలు**

**సెలక్షన్ లిస్ట్ విడుదల చేసిన మంత్రి రాజనర్సింహ**

**గడిచిన రెండేళ్లలో 9 వేలకుపైగా పోస్టుల భర్తీ**

**భర్తీ ప్రక్రియలో మరో 7 వేలకుపైగా పోస్టులు**



హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): డాక్టర్లు, వైద్య సిబ్బందితో ప్రభుత్వ హాస్పిటళ్లు కలకలలాడుతున్నాయని.. పేషెంట్లకు మెరుగైన సేవలు అందుతున్నాయని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ (గ్రేడ్%-%2) పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను సోమవారం ఆయన విడుదల చేశారు. ప్రభుత్వ హాస్పిటళ్లలోని 1284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి గతేడాది చివరిలో మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేయగా, 24,045 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 23,323 మంది బోర్డు నిర్వహించిన పరీక్షకు (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) హాజరయ్యారు. వీరిలో పోస్టులకు ఎంపికైన వారి జాబితాను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సిద్ధం చేయగా, సెక్రటేరియట్‌లో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, ఇతర అధికారులతో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం ఆ జాబితాను విడుదల చేశారు. అనంతరం, ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల వివరాలు, వారు సాధించిన మార్కుల వివరాలను బోర్డు వెబ్‌సైట్‌లో అధికారులు అప్‌లోడ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉద్యోగం సాధించిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 9 వేలకుపైగా పోస్టులను భర్తీ చేశామని, మరో 7 వేలకుపైగా పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నదని తెలిపారు. డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్ వంటి ముఖ్యమైన పోస్టులతో పాటు, వైద్య సేవలు మెరుగుపర్చేందుకు అవసరమైన ఇతర అన్నిరకాల పోస్టులనూ భర్తీ చేస్తున్నామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చే నాటికి డాక్టర్లు, సిబ్బంది లేక వెలవెలబోయిన హాస్పిటళ్లు, ఇప్పుడు కలకలలాడుతున్నాయని మంత్రి వ్యాఖ్యానించారు. డాక్టర్లు, సిబ్బంది రాకతో ప్రభుత్వ హాస్పిటళ్లకు వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. వీలైనంత త్వరలో మిగిలిన పోస్టుల భర్తీ ప్రక్రియను కూడా పూర్తి చేస్తామనితెలిపారు.

# ఐయామ్ సారీ బాలయ్య!

**ఎమోజి వివాదంపై స్పందించిన సీవీ ఆనంద్**

**సోషల్ మీడియా హ్యాండ్లర్ వల్లే పొరపాటు జరిగిందని వెల్లడి**



హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): సినీ నటుడు, టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ అభిమానుల ఆగ్రహంపై తెలంగాణ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్ ఎట్టకేలకు స్పందించారు. తన ఎక్స్ ఖాతా నుంచి వచ్చిన ఎమోజి రిప్లైతో చెలరేగిన వివాదంపై ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ఆ వివాదానికి కారణం తాను కాదని, తన సోషల్ మీడియా హ్యాండ్లర్ చేసిన పొరపాటు అని స్పష్టం చేశారు. ఈ ఘటన బాలకృష్ణను బాధించి ఉంటే క్షమాపణ కోరుతున్నట్లు తెలిపారు. గత నెలలో టాలీవుడ్ ప్రముఖులతో పైరసీ నివారణపై సీవీ ఆనంద్ ఓ సమావేశం నిర్వహించారు. ఈ మీటింగ్‌కు చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్ వంటి అగ్ర నటులు హాజరయ్యారు. ఈ విషయంపై ఆయన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేయగా, 'ఈ మీటింగ్‌కు బాలకృష్ణను కూడా పిలవాలి. లేదంటే ఆయన ఏపీ అసెంబ్లీలో అడుగుతారు' అంటూ ఓ నెటిజన్ వ్యంగ్యంగా కామెంట్ చేశారు. దీనికి సీవీ ఆనంద్ ఖాతా నుంచి నవ్వుతున్న ఎమోజితో రిప్లై వచ్చింది. దీంతో బాలయ్య అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ నటుడు, ఎమ్మెల్యే అయిన బాలకృష్ణను అవమానించారంటూ, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వివాదంపై సీవీ ఆనంద్ తాజాగా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. "దాదాపు రెండు నెలల క్రితం పెట్టిన ఒక ఎమోజి కోసం బాలయ్య అభిమానులు, యాంటీ ఫ్యాన్స్ తనను టార్గెట్ చేయడం గమనించాను. నాకు సమయం లేకపోవడంతో నా సోషల్ మీడియా ఖాతాలను ఓ హ్యాండ్లర్ చూసుకునేవాడు. సెప్టెంబర్ 29న బాలయ్య గారిపై వచ్చిన కామెంట్‌కు అతను నవ్వుతున్న ఎమోజితో స్పందించాడు. అది పూర్తిగా తప్పు. ఈ విషయం తెలిసిన వెంటనే ఆ పోస్ట్‌ను తొలగించి, బాలకృష్ణ గారికి వ్యక్తిగతంగా మెసేజ్ చేసి క్షమాపణ కోరాను. బాలయ్య, చిరంజీవి, వెంకటేశ్, నాగార్జునల సినిమాలు చూస్తూ పెరిగాను, వారందరిపై నాకు గౌరవం ఉంది. ఇప్పటికే ఆ సోషల్ మీడియా హ్యాండ్లర్‌ను తొలగించాను. దయచేసి అందరూ ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలి" అని అభ్యర్థించారు.

# ఉద్యోగుల కులం.. పెండింగ్‌లో 45 శాఖల డేటా

హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కుల వివరాల సేకరణ ప్రక్రియ ఇప్పుడు ముగింపు దశకు చేరుకుంది. మొత్తం 390 ప్రభుత్వ విభాగాల్లో 345 విభాగాలు ఇప్పటికే వివరాలను సమర్పించగా, మరో 45 విభాగాలు ఇంకా డేటాను అందించాల్సి ఉందని బీసీ కమిషన్ స్పష్టం చేసింది. సోమవారం బీసీ కమిషన్ కార్యాలయంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మిలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు డేటా సేకరణ పురోగతిని సమీక్షించారు. వివరాలు సమర్పించని విభాగాలపై దృష్టి సారిస్తూ, వచ్చే 10 రోజుల్లో ఆ శాఖల కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు కమిషన్ తెలిపింది. అదేవిధంగా, విద్యార్థుల కుల వివరాల సేకరణ ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సీడ్ పథకానికి అర్హులైన వారికి అవసరమైన డీఎన్‌జీ సర్టిఫికెట్ జారీ విధానాలపై కమిషన్ సమగ్ర నివేదికను త్వరలో ప్రభుత్వంకు అందించనుంది. కమిషన్ కార్యాలయంలో బీసీ కులాలపై పుస్తకాలు, రీసెర్చ్ మెటీరియల్, వివిధ రిపోర్టులతో లైబ్రరీని బలపరచాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక రీసెర్చ్ అసోసియేట్‌ను నియమించేందుకు ఆమోదం తెలిపినట్టు సభ్యులు వెల్లడించారు.

# ఈదురు గాలులు వచ్చేస్తున్నాయ్!

**7 జిల్లాలపై తీవ్ర ప్రభావం: ఐఎండీ**

**రాష్ట్రంలో మరింత పెరగనున్న చలితీవ్రత**



హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): తెలంగాణవ్యాప్తంగా చలితీవ్రత పెరిగింది. ఎముకలు కొరికే చలికి జనం తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఉదయం వేళల్లో భారీగా పొగమంచు కురుస్తున్నది. దానికి తోడు చలిగాలులు వీస్తుండడంతో జనం అల్లాడుతున్నారు. ఈ క్రమంలో వాతావరణశాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాబోయే రెండురోజులు తెలంగాణలో అక్కడక్కడ కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే నాలుగు నుంచి ఐదు డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. సోమవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ చలిగాలులు వీస్తాయని హెచ్చరించింది. మంగళవారం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శీతలగాలులు వీచే ఛాన్స్ ఉందని హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఆ తర్వాత రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని చెప్పించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24 గంటల్లో పలుచోట్ల ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో అత్యల్పంగా 7.4 డిగ్రీ సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణశాఖ తెలిపింది. రాగల రెండు రోజులు చలి తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణశాఖ హెచ్చరించింది. అదే సమయంలో హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సోమవారం ఉదయం ఈ సీజన్‌లోనే ఉష్ణోగ్రతలు కనిష్టానికి పడిపోయాయని వాతావరణశాఖ తెలిపింది. హైదరాబాద్ యూనివర్సిటీ పరిధిలో 8.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైందని పేర్కొంది. రాజేంద్రనగర్‌లో 10, కంటోన్మెంట్‌లో 11.2, మారేడ్‌పల్లిలో 11.5, కుత్బుల్లాపూర్‌లో 12, గచ్చిబౌలిలో 12 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయని.. సోమవారం రాత్రి సైతం చలి కొనసాగే అవకాశం ఉందని తెలిపింది.

# మరో 15 ఏళ్లు అధికారం కాంగ్రెస్‌దే

మిర్యాలగూడ, నవంబర్ 17 (ఈవార్తలు): రాష్ట్రంలో మరో 15 ఏళ్లు కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జోస్యం చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో ఇది రుజువైందని చెప్పారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం కాల్వపల్లి వద్ద రింగురోడ్డు పనులకు మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఒక పార్టీకి డిపాజిట్ గల్లంతైందని.. మరో పార్టీ కుటుంబ కలహాలతో కొట్టుమిట్టాడుతోందన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అన్ని సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా మారుస్తున్నామన్నారు. స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే వారి ద్వారా అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి సాధిస్తామని చెప్పారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లా కార్యకర్తల కృషి కారణమన్నారు. కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు. పదేళ్లలో జరగని అభివృద్ధిని రెండేళ్లలో చేసి చూపించామన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని చెప్పారు. డించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు 48 నుంచి 72 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని ఉత్తమ్ తెలిపారు.

# సంధ్య కన్వెన్షన్ అక్రమ నిర్మాణాలు కూల్చివేత

గచ్చిబౌలి/హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని గచ్చిబౌలి సంధ్య కన్వెన్షన్ వద్ద అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు తొలగించారు. ఇక్కడి ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. లేఅవుట్‌లో రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని స్థానికులు ఇటీవల హైకోర్టుకు వెళ్లారు. వెంటనే ఆక్రమణలను తొలగించాలని ఉన్నత న్యాయస్థానం హైడ్రాకు సూచించింది. దీంతో కోర్టు ఆదేశాల మేరకు సోమవారం ఉదయం అధికారులు చర్యలు చేపట్టారు. పోలీసు బందోబస్తు మధ్య అనుమతులు లేని నాలుగు షెడ్లు, నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చేశారు.



# పొంగ మంచు.. జాగ్రత్త!

**వాహనదారులు నెమ్మదిగా డ్రైవ్ చేయండి.. జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ సూచన**



జగిత్యాల టౌన్, నవంబర్ 17 (ఈవార్తలు): శీతాకాలం దృష్ట్యా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతుండటంతో ఉదయం మరియు రాత్రి వేళల్లో రహదారులపై పొగమంచు అధికంగా ఏర్పడుతోంది. దీనివల్ల ముందున్న వాహనాలు స్పష్టంగా కనపడక ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది ఈ నేపథ్యంలో అన్ని వాహనదారులు తప్పనిసరిగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. ఈ మేరకు ప్రత్యేకంగా సూచనలు చేశారు.

- పొగమంచు ఎక్కువగా ఉన్నప్పుడు వాహన వేగం తగ్గించుకోవాలి, అవశ్యకమైతే రోడ్డు పక్కకు ఆపి పరిస్థితి మెరుగుపడిన తర్వాతే ప్రయాణం కొనసాగించాలి.
- హెడ్‌లైట్లు, ఫాగ్‌లైట్లు ఆన్ చేసి ప్రయాణించాలి. హెడ్‌లైట్లు హై-బీమ్‌లో పెట్టకుండా లో-బీమ్‌లో ఉపయోగించాలి.
- ముందున్న వాహనానికి సురక్షిత దూరం పాటించాలి. ఆకస్మికంగా బ్రేక్ వేయడం ప్రమాదాలకు దారితీస్తుంది.
- పొగమంచు ఉన్నప్పుడు ఓవర్‌టేక్ చేయడం అత్యంత ప్రమాదకరం. ఎదురుగా లేదా పక్కన ఉన్న వాహనాలు స్పష్టంగా కనిపించనందున, ఓవర్‌టేక్ ప్రయత్నాలు తీవ్ర పరిణామాలకు దారితీయవచ్చు.
- పొగమంచు అధికంగా ఉన్న సమయంలో మీ వాహనాలను రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ పార్క్ చేయకండి. ఒకవేళ రోడ్డు పక్కన పార్క్ చేయాల్సి వస్తే ఇండికేటర్లను ఆన్ చేయాలి. రోడ్ బే, పెట్రోల్ బంక్ వంటి సురక్షిత ప్రదేశాల్లో ఆగడం మంచిది.
- రోడ్డుపై జీబ్రా లైన్లు, సైన్‌బోర్డులు కనిపించకపోవచ్చని గుర్తుంచుకొని అత్యంత జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలి.
- బైక్ రైడర్లు తప్పనిసరిగా హెల్మెట్, కార్ డ్రైవర్లు సీట్‌బెల్ట్ ధరించాలి.
- పాదచారులు కూడా రోడ్డు దాటేటప్పుడు రెండు వైపులా చూసి, అవసరమైతే వాహనాలు పూర్తిగా ఆగేవరకు వేచి ఉండాలి.
- హైవేలపై ప్రయాణించే వారు ముందుగానే వాతావరణ పరిస్థితులు తెలుసుకుని బయలుదేరాలి.
- బస్సులు, లారీలు, ఆటోలు వంటి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు నడిపే డ్రైవర్లు మరింత జాగ్రత్తలు పాటించాలి.

## స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ లేదు

**ఏపీ ప్రభుత్వం కీలక ప్రకటన**

వైజాగ్, నవంబర్ 17 (ఈవార్తలు): వైజాగ్ స్టీల్ ప్లాంట్‌పై ఏపీ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయడం లేదని స్పష్టం చేసింది. ప్రగతి వైపు ప్రస్థానం సాగిస్తుందని పేర్కొంది. ఎన్డీయే ప్రభుత్వ సహకారంతో విశాఖ ఉక్కు పరిశ్రమ బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం



చేసింది. తద్వారా స్టీల్ ప్లాంట్‌కు మరింత సాయం అందిస్తామని చెప్పింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17 నెలల్లోనే వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 15వేల కోట్ల సాయం అందించినట్లు ఏపీ ప్రభుత్వం తెలిపింది. దేశంలో మరే పబ్లిక్ సెక్టార్ కంపెనీకి ఇవ్వని స్థాయిలో ప్రభుత్వాలు వైజాగ్ స్టీల్‌కు ఈ ఆర్థిక సాయం అందించినట్లు ప్రకటించింది. అలాగే ఓవరాల్ కెపాసిటీ యుటిలైజేషన్‌ను సైతం ఈ 17 నెలల్లో 48 నుంచి 79 శాతానికి పెంచినట్లు తెలిపింది. స్టీల్ కార్మికుల జీతాల్లో కోతలను విధిస్తూ వైజాగ్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఇటీవల జారీ చేసిన ఓ సర్క్యులర్ తీవ్ర చర్చనీయాంశమైంది. . నవంబర్ నుంచి ప్లాంట్ ఉత్పత్తి లక్ష్యాల ఆధారంగా వేతనాలు చెల్లిస్తామని.. ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోకుంటే జీతాల్లో కోతలు విధిస్తామని సర్క్యులర్‌లో తెలపడంపై కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల తాము తీవ్రంగా నష్టపోతామని కార్మికులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని ఇవాళ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ఎదుట కార్మికులు పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. ఉత్పత్తి ఆధారంగా జీతాలు ఇస్తామన్న సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఏపీ ప్రభుత్వం కీలక ప్రకటన చేయడం గమనార్హం.

# సజ్జనార్‌కు పవన్ అభినందనలు

**పైరసీ వల్ల చిత్ర పరిశ్రమ తీవ్రంగా నష్టపోతోందని ఆందోళన**

**బెట్టింగ్, పొంజీ స్కీమ్‌లపైనా సజ్జనార్ చర్యలను కొనియాడిన పవన్**



హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): ప్రముఖ పైరసీ వెబ్‌సైట్లు 'ఐబొమ్మ', 'బప్పం టీవీ' నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్ట్ చేసిన హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులను, నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌ను ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందించారు. చిత్ర పరిశ్రమకు తీవ్ర నష్టం కలిగిస్తున్న పైరసీపై ఉక్కుపాదం మోపడం స్వాగతించదగ్గ పరిణామమని ట్వీట్ చేశారు. 'సినిమా పైరసీ ముఠాను అరెస్ట్ చేసిన హైదరాబాద్ పోలీసులకు, సిటీ కమిషనర్ వీసీ సజ్జనార్ కి అభినందనలు. డబ్బుల రూపంలోనే కాదు, సృజనాత్మకతనూ పెట్టుబడిగా పెట్టి నిర్మించే సినిమాలను విడుదలైన రోజునే ఇంటర్నెట్ లో పోస్ట్ చేస్తున్న ముఠాల వల్ల చిత్ర పరిశ్రమ తీవ్రంగా నష్టపోతోంది. సినిమా విడుదలే ఒక మహా యజ్ఞంగా మారిపోయిన తరుణంలో పైరసీ ముఠాలను కట్టడి చేయడం దర్శకనిర్మాతలకు సాధ్యం కావడం లేదు. పైరసీలో కీలకంగా ఉన్న ఐబొమ్మ, బప్పమ్ వెబ్ సైట్ల నిర్వాహకుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి, అతనితోనే వాటిని మూయించివేయడం స్వాగతించదగ్గ పరిణామం. పోలీసులకు సవాల్ విసిరే స్థాయికి పైరసీ ముఠాలు వచ్చిన తరుణంలో హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసు బృందం చేసిన ఆపరేషన్ విజయవంతమైంది. ఈ ఆపరేషన్లో భాగమైన పోలీసులకు, సిటీ కమిషనర్ వీసీసజ్జనార్ కు అభినందనలు తెలియచేస్తున్నాను. బెట్టింగ్ మాఫియా, పొంజీ స్కీమ్స్ లాంటివాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, వాటి వల్ల ప్రజలు ఏ విధంగా ఆర్థికంగా చితికిపోతున్నారో సజ్జనార్ చైతన్యపరుస్తున్నారు. ఆయనతో ఓ సందర్భంలో సమావేశమైనప్పుడు పొంజీ స్కీమ్స్ మూలంగా ప్రజలు ఆర్థికంగా ఏ విధంగా మోసానికి గురై నష్టపోతున్నారో వివరించారు. అలాగే బెట్టింగ్ యాప్స్ ను నియంత్రించేందుకు సజ్జనార్ చేపట్టిన కార్యక్రమం అన్ని రాష్ట్రాల్లోనూ కదలిక తీసుకువచ్చింది. ఆయన నేతృత్వంలో చేపట్టే చర్యలు కచ్చితంగా తెలుగు సినిమాకే కాదు యావత్ భారతీయ చిత్ర పరిశ్రమకు మేలు చేస్తాయి' అని పవన్ కల్యాణ్ వివరించారు.

# గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు గుడ్ న్యూస్

**అంతర్‌జిల్లా బదిలీలకు అనుమతిస్తూ జీవో జారీ**

**ఆన్‌లైన్‌లో పారదర్శకంగా దరఖాస్తుల స్వీకరణ**

అమరావతి, నవంబర్ 17 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు తీపి కబురు అందించింది. భార్యాభర్తలు (స్పౌజ్) వేర్వేరు జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని, వారి అంతర్‌జిల్లా బదిలీలకు అనుమతిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు (జీవో) జారీ చేశారు. సచివాలయ ఉద్యోగుల నుంచి చాలాకాలంగా వస్తున్న విజ్ఞప్తులపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. భార్యాభర్తలు ఒకేచోట పనిచేసేందుకు వీలు కల్పించే ఈ నిర్ణయంతో వేలాది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. బదిలీల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అర్హులైన ఉద్యోగులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ బదిలీల ప్రక్రియను నవంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను త్వరలోనే విడుదల చేయనున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సచివాలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది తమ పనితీరు మెరుగుపడటంతో పాటు, కుటుంబపరమైన ఒత్తిడిని తగ్గిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

## కరెంట్ షాక్‌తో రైతు మృతి



చందుర్తి, నవంబర్ 17 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన అంబిరీ లింగం (65) అనే రైతు ఆదివారం కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. లింగం కుమారుడు అంబిరీ పూర్ణ చందర్ తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ పనుల నిమిత్తం పొలం దగ్గర వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో.. పొలం వద్దకు వెళ్లి చూడగా, మోటార్ స్టార్టర్ బాక్స్ వద్ద కరెంట్ షాక్ తగిలి పడి ఉండడం గమనించానని తెలిపారు. పక్కనే ఉన్న రైతులను పిలిచి సహాయం అడిగి, వేములవాడ ఏరియా ఆసుపత్రి తరలించే క్రమంలో మార్గం మధ్యలో చనిపోయినట్టు తెలిపాడు. పూర్ణచందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

## ఓఎల్‌ఎక్స్‌లో అమ్మకానికి ఎమ్మార్వో ఆఫీసు

**రూ.20వేలకే సేల్‌కు పెట్టిన ఓ ఘనుడు**

గిద్దలూరు, నవంబర్ 17 (ఈవార్తలు): ఓఎల్‌ఎక్స్‌లో ఇప్పుడు ఒక పోస్టు వైరల్‌గా మారింది. ఏదైనా సెకండ్ హ్యాండ్ వస్తువులను అమ్మేందుకు ఉపయోగించే ఈ ఓఎల్‌ఎక్స్‌లో ఒక వ్యక్తి ఒక భవనాన్ని అమ్మకానికి పెట్టాడు. బిల్డింగ్ అమ్మకానికి పెడితే అంత ట్రెండింగ్ ఎందుకు అవుతుందని అనుమానం వస్తుందా.. దానికి కారణం ఉంది.. అదేంటంటే.. అది సదరు వ్యక్తికి చెందిన ఇల్లు కాదు.. ప్రభుత్వ భవనం. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన ఎమ్మార్వో ఆఫీసు. గిద్దలూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఓ ఆకతాయి ఓఎల్‌ఎక్స్‌లో అమ్మకానికి పెట్టాడు. అది కూడా కేవలం రూ. 20వేలకే. ఈ పోస్టు చాలామందికి చేరడంతో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో చివరకు ఈ విషయం గిద్దలూరు ఎమ్మార్వో దృష్టికి వెళ్లింది. అది తెలిసి కంగుతిన్న ఎమ్మార్వో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఎమ్మార్వో ఆఫీసును అమ్మకానికి పెట్టిన ఆకతాయి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# పోలీసులకు సవాల్ విసిరితే ఊరుకుంటారా?

**ఐబొమ్మ రవి అరెస్ట్‌పై తండ్రి స్పందన**

హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): సినిమాల పైరసీ నిర్వాహకుడు ఐబొమ్మ రవి ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్నాడు. ఆయనపై అనేక పైరసీ కేసులున్నాయి. ఈ క్రమంలో శనివారం ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మంది రవిని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. సోమవారం ఆయన అరెస్ట్ కి సంబంధించిన వివరాలను వెల్లడించారు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్. అయితే కొడుకు అరెస్ట్ పై తాజాగా తండ్రి అప్పారావు స్పందించారు. ఈ విషయం తనకు బంధువుల ద్వారా తెలిసిందని, వాళ్లు పేపర్‌లో చూసి తెలుసుకున్నారని అన్నారు. అంతకు మించి తనకు దీని గురించి ఏమీ తెలియదన్నారు. అంతేకాదు కొడుక్కి పెద్ద ఝలక్ ఇచ్చారు. రవిని డిగ్రీ వరకు చదివించానని, ఆంధ్రా యూనివర్సిటీలోనూ చదువుకున్నాడని, అప్పట్నుంచి తన ఖర్చులు తానే చూసుకునేవాడని చెప్పారు తండ్రి. ఆ తర్వాత హైదరాబాద్‌కి వెళ్లినట్టు తెలిపారు. కొన్నాళ్ల తర్వాత సాఫ్ట్ వేర్ కంపెనీలో జాబ్ వచ్చిందని చెప్పినట్టు, రవితో మాట్లాడి రెండు నెలలపైనే అవుతుందన్నారు. రవిపై కేసులు నమోదైనట్టు తనకు తెలియదని, రవి పైరసీ సైట్‌ని నడుపుతున్నాడని గానీ తెలియదన్నారు. ఇవేవీ తనతో మాట్లాడలేదని, ఏవీ చెప్పేవాడు కాదని తెలిపారు. కొడుకుని అరెస్ట్ విషయంపై స్పందిస్తూ, సమాజానికి ఎవరు చెడు చేసినా చర్యలు తీసుకోవాల్సిందే అని, రవి కేసుని హైదరాబాద్ పోలీసులు చూసుకుంటారని తెలిపారు. రవి ఇంటి నుంచి వెళ్లిపోవడానికి కారణాలు తండ్రి అప్పారావు చెబుతూ.. తనకు, భార్యకి కొడవలు వచ్చాయట. దీంతో కొంత కాలం దూరంగా ఉన్నామని తెలిపారు. ఆ తర్వాత ఎవరికి వాళ్లం పటాపంచలమైపోయామని, అంతకు ముందు ఇంటి నుంచి బయటకు వెళ్లేవాళ్లం కాదని, అలాంటిది ఇప్పుడు నలుగురం ఊర్లమీద పడిపోయామన్నారు తండ్రి. ఒక్క ఆడపిల్ల ఉంటే పెళ్లి చేశామని, మొన్నటి వరకు ఇంటి దగ్గరే ఉందని, ఆ తర్వాత అల్లుడు వచ్చి తీసుకెళ్లాడని చెప్పాడు. రవి ఏదో నెట్ వర్క్ పనులు చేస్తున్నాడని, పొట్టకూటి కోసం ఏదో పని చేస్తున్నాడని అనుకునే వాడిని, కానీ ఇలాంటి పనికిమాలిన పనులు చేస్తున్నాడని తెలియదు. ఇంటికొచ్చి రెండు ఏళ్లు అవుతుంది, అంతకు ముందు తనకు రావాల్సినప్పుడు వచ్చేవాడని తెలిపారు అప్పారావు. రవి లవ్ మ్యారేజ్ చేసుకున్నాడని, పెద్దల్లుడే హైదరాబాద్‌లో పెళ్లి చేశాడని, కోడలు పెద్ద ఉద్యోగం చేస్తుందని, కానీ ఆ తర్వాత వాళ్లిద్దరి విడిపోయారని తెలిసిందన్నారు. వారికి ఓ పాప కూడా ఉందని, కలిసి ఉండాలని చాలా సార్లు చెప్పానని, కానీ వినడం లేదన్నారు. అయితే రవి చేసేందే ఎదవ పని, కానీ పోలీసులకు సవాల్ విసిరితే వాళ్లు ఊరుకుంటారని, వాళ్లు ఏం చేయాలో అది చేస్తారు, ప్రభుత్వంతో పెట్టుకోవద్దని, అలాంటి రవి అలా చేయడం కరెక్ట్ కాదని, ప్రభుత్వానికే సవాల్ విసిరేంత పెద్దోడు అయ్యాడా? అంటూ రివర్స్ ప్రశ్నించాడు తండ్రి. చట్టం ప్రకారం ఏం చేయాలనుకున్నారో అది చేస్తారని, ఈ విషయంలో తాను ఏం చెప్పలేనని వెల్లడించారు.




## 19న రైతుల ఖాతాల్లోకి అన్నదాత సుఖీభవ

హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధుల విడుదలకు ఏపీ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 19వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయనుంది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించనున్నారు. రెండో విడతలో భాగంగా మొత్తం 46,85,838 రైతు కుటుంబాలకు రూ. 3135 కోట్ల రూపాయలను ప్రభుత్వం అందించనుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ. 2 వేలు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ. 5 వేలు కలిపి ప్రతి రైతు ఖాతాలో మొత్తం రూ. 7 వేలు జమ కానున్నాయి. ఇప్పటికే ఆగస్టు నెలలో తొలి విడత కింద రూ. 3174 కోట్లు అందించగా, రెండు విడతల్లో కలిపి మొత్తం రూ. 6309.44 కోట్లను రైతులకు అందజేసినట్లు అవుతుంది. ఈ నెల 19న ముఖ్యమంత్రి చంద్రబాబు కమలాపురంలో జరిగే అధికారిక కార్యక్రమంలో పాల్గొని ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. పుట్టపర్తి పర్యటన ముగించుకున్న అనంతరం ఆయన మధ్యాహ్నం కమలాపురం చేరుకుంటారు. ఈ కార్యక్రమాన్ని కేవలం నిధుల విడుదలకే పరిమితం చేయకుండా, వ్యవసాయ రంగంలో ప్రభుత్వ ఆలోచనలను, భవిష్యత్ ప్రణాళికలను రైతులకు వివరించేలా నిర్వహించాలని సీఎం అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 10 వేలకు పైగా రైతు సేవా కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు స్థానికంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా అగ్రిటెక్, డిమాండ్ ఉన్న పంటల సాగు, మార్కెటింగ్ సౌకర్యాలు, ప్రకృతి సేద్యం, భూసార పరీక్షల ప్రాముఖ్యత, ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా పంటకు అదనపు

# ఏపీకి 17 ప్రాజెక్టులు

**కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటన**





న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త వినిపించింది. ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ తయారీ పథకం కింద దేశవ్యాప్తంగా మరో 17 ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ 17 ప్రాజెక్టుల ద్వారా 7,172 కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టనున్నారు. ఈ పెట్టుబడుల ద్వారా 11 వేల 808 మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. దేశంలోని 9 రాష్ట్రాలలో ఈ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా ఉండటం విశేషం. మరోవైపు ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ తయారీ పథకం తొలి విడతలో.. రూ 5,532 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఏడు ప్రతిపాదనలకు కేంద్రం గతంలో ఆమోదం తెలిపింది. ఇప్పుడు రెండో విడతగా మరో 17 ప్రతిపాదనలను కేంద్ర ఎలక్ట్రానిక్స్. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆమోదించింది. గోవా, గుజరాత్, జమ్మూ కాశ్మీర్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఈ యూనిట్లు ఏర్పాటు చేస్తారు. ఇందులో భాగంగా దేశంలోనే తొలి ఆప్టికల్ ట్రాన్సీవర్ తయారీ ఫెసిలిటీని జాబిల్ సర్క్యూట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, జెట్‌కెమ్ సప్లై చైన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేయనున్నాయి. కమ్యూనికేషన్ పరికరాలు, కంప్యూటర్లు, పారిశ్రామిక ఎలక్ట్రానిక్స్‌లో ఖచ్చితమైన టైమింగ్ అప్లికేషన్‌ల కోసం ఉపయోగించే ఆసిలేటర్లను.. రాకోన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తయారు చేయనుంది. ఏక్వాస్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌వాచ్‌ల కోసం ఎన్‌క్లోజర్‌లు.. అసక్స్ సేఫ్టీ కాంపోనెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, యునో మిండా లిమిటెడ్, సిర్మా మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా కెమెరా మాడ్యూల్స్ యూనిట్లు ఏర్పాటు చేస్తారు. ఎలక్ట్రానిక్ అప్లికేషన్‌ల కోసం కనెక్టర్‌ల తయారీ యూనిట్లను టీఈ కనెక్టివిటీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నెలకొల్పనుంది. యూనిట్ల ఏర్పాటుకోసం సదరు సంస్థల చేసిన ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ నిర్వహించిన ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్ "ది ఫౌండేషన్ ఫర్ ఎ గ్లోబల్లీ కాంపిటీటివ్ ఎలక్ట్రానిక్స్ వాల్యూ చైన్" అనే కార్యక్రమంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ వివరాలను వెల్లడించారు. ఈ యూనిట్ల ఏర్పాటు వలన సమతుల్య ప్రాంతీయ వృద్ధి, నైపుణ్యం గల ఉద్యోగాల సృష్టికి జరుగుతుందన్నారు.

## 5 నిమిషాలు మౌస్ కదలకపోతే..!

**ఉద్యోగి ఖాళీగా ఉన్నట్లే లెక్క.. ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ నిఘా!**

న్యూఢిల్లీ: ఉద్యోగులకు కంపెనీ జారీ చేసిన ల్యాప్‌టాప్‌లు, పీసీలలో వారి కార్యకలాపాలను ట్రాక్ చేయడానికి ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ నూతన పర్యవేక్షణ వ్యవస్థను ప్రవేశపెట్టినట్లు సమాచారం. ఐటీ రంగంలో ఉద్యోగి పనితీరుపై నిత్యం నిఘా ఉంటుందనే విషయం తెలిసిందే. కాగ్నిజెంట్ ఇప్పుడు ఉద్యోగుల కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం ఈ పర్యవేక్షణ వ్యవస్థను తీసుకువచ్చింది. కంపెనీ జారీ చేసిన ల్యాప్‌టాప్‌లు, పీసీల ద్వారా ఉద్యోగుల పనితీరును ట్రాక్ చేస్తోంది. ఇందుకోసం 'ప్రోహాన్స్' వంటి వర్క్ ఫోర్స్ మేనేజ్‌మెంట్ సాధనాలను వినియోగిస్తోంది. ఉద్యోగులు ఉపయోగించే కీబోర్డు, మౌస్‌ల ద్వారా ట్రాక్ చేస్తోంది. ఈ తరహా ట్రాకింగ్‌పై విమర్శలు వస్తున్నాయి. ఉద్యోగి పని చేయకుండా ఖాళీగా ఉన్న సమయాన్ని ప్రోహాన్స్ వంటి టూల్ ట్రాక్ చేస్తుంది. మౌస్ లేదా కీబోర్డు 5 నిమిషాల కంటే ఎక్కువసేపు ఇన్-యాక్టివ్‌గా ఉంటే ఆ ఉద్యోగి ఖాళీగా ఉన్నట్లు పరిగణిస్తారు. అదే 15 నిమిషాల కంటే ఎక్కువసేపు ఇన్-యాక్టివ్‌గా ఉంటే వేరే పనిలో నిమగ్నమైనట్లు పరిగణిస్తారు. ఈ మానిటరింగ్ వ్యవస్థ ఒక్కో టీమ్‌కు ఒక్కో విధంగా ఉంటుందని కథనాలు వెలువడ్డాయి. ఈ ట్రాకింగ్ వ్యవస్థపై విమర్శలు వస్తుండటంతో కంపెనీ స్పందించింది. ఈ ట్రాకింగ్‌ను ఉద్యోగి పనితీరుకు ముడిపెట్టబోమని స్పష్టం చేసింది. ప్రమోషన్లు, బోనస్ వంటి అంశాల్లో ఈ డేటాను ఉపయోగించబోమని వెల్లడించింది.

## ఏఐ కన్నా నైపుణ్యలేమి పెద్ద సంక్షోభం

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) రాకతో వైట్ కాలర్ ఉద్యోగాలు కనుమరుగవుతాయనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. అయితే, దీనికంటే పెద్ద సంక్షోభం మన ముందు ఉందని, దాన్ని మనం గుర్తించడం లేదని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా అన్నారు. నైపుణ్యం కలిగిన కార్మికుల కొరతే అసలైన సమస్య అని ఆయన తన ట్వీట్‌లో అభిప్రాయపడ్డారు. అమెరికా ఆటోమొబైల్ దిగ్గజం 'ఫోర్డ్' సీఈవో జిమ్ ఫార్లే ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో చెప్పిన విషయాన్ని ఆయన ఉటంకించారు. ఫోర్డ్‌లో ప్రస్తుతం 5,000 మెకానిక్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిలో చాలా వాటికి వార్షిక వేతనం రూ. కోటి (1,20,000 డాలర్లు)కి పైగా ఉన్నప్పటికీ భర్తీ కావడం లేదని మహీంద్రా పేర్కొన్నారు.

## ముందుగానే అందుబాటులోకి ఐటీఆర్ ఫారాలు

**సీబీడీటీ చీఫ్ రవి అగర్వాల్ వెల్లడి**

న్యూఢిల్లీ: వచ్చేసారి ఐటీ రిటర్న్ ఫారాలు ముందుగానే అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) చీఫ్ రవి అగర్వాల్ వెల్లడించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి రానున్న ఆదాయపు పన్ను చట్టం-2025 కింద ఐటీఆర్ ఫారాలను ముందుగానే అందుబాటులోకి తేనున్నట్లు ఆయన తెలిపారు. ఆరు దశాబ్దాలుగా చెల్లుబాటులో ఉన్న ఆదాయపు పన్ను చట్టం-1961 స్థానంలో తీసుకువచ్చిన కొత్త చట్టానికి అనుగుణంగా ఈ ఫారాలు ఉంటాయని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో ట్యాక్స్ పేయర్స్ లాంజ్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త ఆదాయ చట్టానికి సంబంధించిన కొత్త ఫారాలు, నిబంధనల రూపకల్పన జరుగుతోందని, జనవరి నాటికే అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఫారాలను ముందుగానే అందుబాటులోకి తీసుకురావడం వల్ల ప్రస్తుత విధానాన్ని అర్థం చేసుకోవడానికి పన్ను చెల్లింపుదారులకు సమయం దొరుకుతుందని అన్నారు. కొత్త ఆదాయపు పన్ను చట్టం-2025కు పార్లమెంట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. టీడీఎస్ త్రైమాసిక రిటర్న్ ఫారాలు, ఐటీఆర్ ఫారాలు వంటివి ఇందులో ఉంటాయి. ప్రస్తుత ఫారాలను వెనక్కి తీసుకుని సరళమైన ఫారాలు రూపొందించే అంశంపై సీబీడీటీ పనిచేస్తోంది. 2026 ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం అమల్లోకి రానుంది.

## బెంగాల్ రాజ్ భవన్‌లో తనిఖీలు

కోల్‌కతా: ఆయుధాల నిల్వల ఆరోపణల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ రాజ్ భవన్‌లో కేంద్ర బలగాలు తనిఖీలు నిర్వహించాయి. ఈ ఘటన బెంగాల్ రాజకీయాల్లో సంచలనంగా మారింది. రాజ్ భవన్ ప్రాంగణంలో ఆయుధాలు, మందు గుండు సామగ్రిని నిల్వ చేశారని టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో, గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ ఈరోజు రాజ్ భవన్‌లో పోలీసులు, కేంద్ర బలగాలు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు నిర్వహించారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రస్తుతం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కొనసాగుతోంది. ఈ తరుణంలో ఎన్నికల ప్రక్రియ ప్రక్షాళన అవసరమని గవర్నర్ వ్యాఖ్యానించారు. గవర్నర్ ఎస్ఐఆర్‌ను సమర్థించినట్లుగా వ్యాఖ్యలు చేసిన కొన్ని గంటల్లోనే తృణమూల్ ఎంపీ ఆయుధాల నిల్వలంటూ ఆరోపణలు గుప్పించారు. రాజ్ భవన్ లోపల బీజేపీ నేరస్థులకు గవర్నర్ ఆశ్రయం కల్పించి, వారికి బాంబులు, తుపాకులు సమకూర్చారని సంచలన ఆరోపణలు చేశారు.

**వేమో రోబోట్యాక్సీ**

# పిల్లిని చంపేసింది!

**అట్టుడికిన శాన్‌ఫ్రాన్సిస్కో.. డ్రైవర్‌లెస్ కార్లపై నియంత్రణ కోరుతూ తీర్మానం**

శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో ఓ పెంపుడు పిల్లి మరణం పెద్ద దుమారానికి దారితీసింది. గూగుల్ అనుబంధ సంస్థ అయిన వేమో (%ఔఎఎశీ%)కు చెందిన సెల్ఫ్ డ్రైవింగ్ కారు (రోబోట్యాక్సీ) ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనతో డ్రైవర్‌లెస్ వాహనాల భద్రత, వాటి నియంత్రణపై స్థానికంగా తీవ్రస్థాయిలో చర్చ మొదలైంది. ఈ వాహనాల విషయంలో స్థానిక ప్రభుత్వాలకు కూడా అధికారం ఇవ్వాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. అక్టోబర్ 27న అర్ధరాత్రి సమయంలో శాన్‌ఫ్రాన్సిస్కోలోని మిషన్ డిస్ట్రిక్ట్‌లోని 16వ వీధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. 'కిట్ క్యాట్' అనే పిల్లిని వేమోకు చెందిన రోబోట్యాక్సీ ఢీకొట్టింది. ఈ పిల్లికి ఆ ప్రాంతంలో మంచి పేరుంది. దాని స్నేహపూర్వక స్వభావం కారణంగా స్థానికులు దాన్ని ముద్దుగా '16వ వీధి మేయర్' అని పిలుచుకుంటారు. ఆ పిల్లి మరణంతో చలించిపోయిన స్థానికులు, అది మరణించిన ప్రదేశంలో ఒక స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ వేమో సంస్థను విమర్శిస్తూ ప్లకార్డులు పెట్టారు. అదే సమయంలో, "మనిషి నడిపే కార్ల వల్ల ఏటా వందల జంతువులు చనిపోతున్నాయి" అనే వాస్తవాన్ని గుర్తుచేస్తూ కొందరు బోర్డులు కూడా ఉంచడం గమనార్హం. ఈ ఘటనపై రాజకీయంగానూ తీవ్ర స్పందన




వ్యక్తమవుతోంది. మిషన్ డిస్ట్రిక్ట్ సూపర్‌వైజర్ జాకీ ఫీల్డర్ ఈ అంశంపై ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. "మనిషి డ్రైవర్ ప్రమాదం చేస్తే, వారిని బాధ్యులను చేయవచ్చు. పోలీసులు వారిని పట్టుకోగలరు. కానీ, రోబోట్యాక్సీ విషయంలో ఎవరిని బాధ్యులను చేయాలి? ఇక్కడ జవాబుదారీతనం ఎవరిది?" అని ఆమె తీవ్రంగా ప్రశ్నించారు. డ్రైవర్‌లెస్ కార్లను తమ ప్రాంతాల్లో అనుమతించాలా లేదా అనే విషయాన్ని నిర్ణయించుకునే అధికారాన్ని స్థానిక ఓటర్లకు ఇవ్వాలని ఆమె తన తీర్మానంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం కాలిఫోర్నియాలో ఈ వాహనాల నియంత్రణ అధికారం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉండగా, స్థానిక అధికారులకు పరిమిత అధికారాలే ఉన్నాయి. దురదృష్టకర ఘటనపై వేమో సంస్థ స్పందించింది. తమ వాహనం బయలుదేరుతున్న సమయంలో పిల్లి అకస్మాత్తుగా దాని కిందకు దూసుకొచ్చిందని పేర్కొంది. "పిల్లి యజమానికి, స్థానిక సమాజానికి మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. దాన్ని ప్రేమించిన వారందరి బాధను మేము అర్థం చేసుకోగలం" అని ఒక ప్రకటనలో తెలిపింది. భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని కంపెనీ చెబుతున్నప్పటికీ, ఈ ఘటన తర్వాత ఎలాంటి నిర్దిష్ట చర్యలు తీసుకున్నారో వెల్లడించలేదు.

# పాక్ ఎగుమతుల సంక్షోభం ఏళ్ల లోపం

**ప్రపంచ బ్యాంకు సీరియస్ వార్నింగ్!**

న్యూఢిల్లీ: పాకిస్థాన్ ఎదుర్కొంటున్న ఎగుమతుల సంక్షోభం తాత్కాలిక సమస్య కాదని, దశాబ్దాలుగా పేరుకుపోయిన లోతైన వ్యవస్థాగత లోపాల ఫలితమని ప్రపంచ బ్యాంకు తీవ్రంగా హెచ్చరించింది. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలంటే తక్షణమే కీలక సంస్కరణలు చేపట్టాలని సూచించింది. ఈ మేరకు 'ది న్యూస్ ఇంటర్నేషనల్' పత్రిక ఒక కథనాన్ని ప్రచురించింది. ప్రపంచ బ్యాంకు తన తాజా నివేదికలో పాకిస్థాన్ బలహీనమైన ఎగుమతులకు గల కారణాలను విశ్లేషించింది. అస్థిరమైన విధానాలు, వక్రీకరించిన మార్కెట్లు, సంస్కరణలను అమలు చేయడంలో నిరంతర వైఫల్యమే ప్రస్తుత దుస్థితికి కారణమని స్పష్టం చేసింది. 1990లలో పాక్ జీడీపీలో ఎగుమతుల వాటా 16 శాతంగా ఉండగా, 2024 నాటికి అది



కేవలం 10 శాతానికి పడిపోయిందని నివేదిక పేర్కొంది. ఇదే సమయంలో భారత్, బంగ్లాదేశ్, వియత్నాం వంటి దేశాలు ఎగుమతుల్లో గణనీయమైన వృద్ధిని సాధించాయని గుర్తుచేసింది. సరైన విధానాలు లేకపోవడం వల్ల పాకిస్థాన్ దాదాపు 60 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులను కోల్పోతోందని అంచనా వేసింది. ముఖ్యంగా, పాకిస్థాన్ అనుసరిస్తున్న కరెన్సీ మార్పిడి రేటు విధానంపై ప్రపంచ బ్యాంకు ఆందోళన వ్యక్తం చేసింది. రాజకీయ కారణాలతో కరెన్సీ రేటును నియంత్రించడం మానేసి, పూర్తిగా మార్కెట్ ఆధారిత విధానాన్ని అనుసరించాలని సూచించింది. దీనివల్ల ఎగుమతులు పెరిగి, విదేశీ పెట్టుబడులు ఆకర్షితమవుతాయని తెలిపింది. అలాగే, వ్యాపార నిర్వహణకు అవుతున్న అధిక వ్యయం కూడా పాక్ పోటీతత్వాన్ని దెబ్బతీస్తోందని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా, బంగ్లాదేశ్, వియత్నాం వంటి పోటీ దేశాలతో పోలిస్తే పాకిస్థాన్‌లో పారిశ్రామిక విద్యుత్ టారిఫ్‌లు దాదాపు రెట్టింపుగా ఉన్నాయని వెల్లడించింది. అధిక సర్‌చార్జీలు, పన్నులు పరిశ్రమలను అంతర్జాతీయ పోటీ నుంచి దూరం చేస్తున్నాయని విమర్శించింది. దేశంలోని వాణిజ్య ఒప్పందాలు కూడా కాగితాలకే పరిమితమయ్యాయని, వాటివల్ల ఆశించిన ప్రయోజనాలు చేకూరడం లేదని ప్రపంచ బ్యాంకు తన నివేదికలో స్పష్టం చేసింది.

# ప్రకటనల రేట్లను 26 శాతం హైక్

**కలర్ యాడ్స్‌కు ప్రత్యేకంగా ప్రీమియం రేట్లు**

**ప్రింట్ మీడియాకు కేంద్రం శుభవార్త**

న్యూఢిల్లీ: ప్రింట్ మీడియా రంగానికి కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వార్తా పత్రికల్లో ప్రచురించే ప్రభుత్వ ప్రకటనల రేట్లను ఏకంగా 26 శాతం పెంచుతూ సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు, కలర్ ప్రకటనలకు ప్రత్యేకంగా ప్రీమియం రేట్లను కూడా ప్రవేశపెట్టింది. ఈ నిర్ణయంతో పత్రికా రంగానికి ఆర్థికంగా చేయూత లభించనుంది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, లక్ష కాపీలు ఉన్న దినపత్రికలకు బ్లాక్ అండ్ వైట్ ప్రకటనల రేటు చదరపు సెంటీమీటర్‌కు రూ. 47.40 నుంచి రూ. 59.68కి పెరిగింది. ఇతర మీడియా నుంచి వస్తున్న పోటీ, గత కొన్నేళ్లుగా పెరిగిన



నిర్వహణ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని ఈ పెంపు నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయం వల్ల ప్రింట్ మీడియాకు ఆర్థిక స్థిరత్వం లభిస్తుందని, తద్వారా నాణ్యమైన జర్నలిజం కొనసాగించడానికి, స్థానిక వార్తా సంస్థలకు మద్దతు ఇవ్వడానికి వీలవుతుందని కేంద్రం పేర్కొంది. మెరుగైన కంటెంట్‌పై పెట్టుబడి పెట్టడం ద్వారా ప్రజా ప్రయోజనాలకు మరింత సమర్థవంతంగా సేవ చేయవచ్చని వివరించింది. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల ప్రచార కార్యక్రమాలను సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) నిర్వహిస్తుంది. చివరిసారిగా 2019 జనవరిలో ప్రకటనల రేట్లను సవరించారు. తాజా సవరణ కోసం 2021 నవంబర్‌లో 9వ రేట్ స్ట్రక్చర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ (%×చీ%) వంటి వివిధ వార్తాపత్రికల సంఘాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను, న్యూస్‌ప్రింట్ ధర, ద్రవ్యోల్బణం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని 2023 సెప్టెంబర్‌లో తన సిఫార్సులను సమర్పించింది. ఈ సిఫార్సుల ఆధారంగానే కేంద్రం తాజా నిర్ణయం తీసుకుంది.

## ఫిబ్రవరి 1 నుంచి చైనాకు ఎయిరిండియా

న్యూఢిల్లీ: టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిరిండియా విమానయాన సంస్థ సోమవారం కీలక ప్రకటన చేసింది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత చైనాకు మళ్లీ తమ సర్వీసులను నడుపుతున్నట్టు వెల్లడించింది. వచ్చే ఏడాది (2026) ఫిబ్రవరి 1 నుంచి ఢిల్లీ, చైనాలోని షాంఘై నగరాల మధ్య నాన్‌స్టాప్ విమానాలను నడపనున్నట్లు తెలిపింది. ఈ మార్గంలో వారానికి నాలుగు సార్లు బోయింగ్ 787-8 విమానాలతో సేవలు అందిస్తామని ఎయిరిండియా పేర్కొంది. ఈ విమానంలో బిజినెస్ క్లాస్‌లో 18 ఫ్లాట్ బెడ్ సీట్లు, ఎకానమీ క్లాస్‌లో 238 విశాలమైన సీట్లు అందుబాటులో ఉంటాయని వివరించింది. అంతేకాకుండా, అవసరమైన అనుమతులు లభిస్తే 2026లోనే ముంబై నుంచి కూడా షాంఘైకి నాన్‌స్టాప్ సర్వీసులను ప్రారంభించాలని యోచిస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఈ సర్వీసుల పునఃప్రారంభంపై ఎయిరిండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ మాట్లాడుతూ, "ఇది కేవలం ఒక కొత్త మార్గాన్ని ప్రారంభించడం కాదు. రెండు గొప్ప ప్రాచీన నాగరికతలు, ఆధునిక ఆర్థిక శక్తుల మధ్య ఇదొక వారధి వంటిది. వాణిజ్యం, విద్య, వైద్యం, సాంస్కృతిక రంగాల్లో ప్రయాణికులకు అవకాశాలు కల్పిస్తున్నందుకు సంతోషంగా ఉంది" అని అన్నారు. 2020 ప్రారంభంలో నిలిచిపోయిన విమాన సంబంధాలను పునరుద్ధరించేందుకు ఇటీవల భారత్-చైనా మధ్య కుదిరిన దౌత్య ఒప్పందాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సర్వీసుల కోసం దశలవారీగా బుకింగ్స్ ప్రారంభిస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. కాగా, ఇటీవలే ఇండిగో సంస్థ కూడా ఢిల్లీ నుంచి చైనాలోని గ్వాంగ్‌జౌకు రోజువారీ విమాన సర్వీసులను ప్రారంభించిన విషయం తెలిసిందే.

## డిజిటల్ అరెస్టులో 32 కోట్లు లూటీ

బెంగళూరు: ఓ మహిళ సైబర్ ఉచ్చులో చిక్కుకుని ఏకంగా కోట్ల రూపాయలను పోగొట్టుకుంది. ఈ ఘటన కర్ణాటక రాజధాని బెంగళూరులో వెలుగు చూసింది. బెంగళూరుకు చెందిన 57 ఏళ్ల మహిళను సీబీఐ అధికారులమంటూ కొందరు డిజిటల్ అరెస్ట్ చేశారు. ముందుగా డీహెచ్ఎల్‌లో ఎగ్జిక్యూటివ్ అని చెప్పి ఓ వ్యక్తి సదరు మహిళకు ఫోన్ చేశాడు. ఆమె పేరు మీద మూడు క్రెడిట్ కార్డులు, నాలుగు పాస్‌పోర్టులు, నిషేధిత ఎండీఎంఏ ఉన్న ఓ పార్శిల్ ముంబైలోని అంధేరీ డీహెచ్ఎల్ కేంద్రానికి వచ్చిందని చెప్పాడు. ఆ ప్యాకేజీతో తనకు ఎలాంటి సంబంధం లేదని, తాను బెంగళూరులో నివసిస్తున్నట్లు ఆమె చెప్పింది. అయితే, ఫోన్ చేసిన వ్యక్తి మీ ఫోన్ నెంబర్ పార్శిల్‌తో లింక్ అయ్యి ఉందని.. అది సైబర్ క్రైమ్ కావొచ్చని హెచ్చరించాడు. వాటిని ఉపయోగించి మోసాలకు పాల్పడుతున్నట్లు సీబీఐ అధికారులు గుర్తించారని బెదిరించాడు. సీబీఐ అధికారుల నుంచి ఫోన్‌కాల్ వస్తుందని తెలిపాడు. ఆ కాసేపటికే సీబీఐ అధికారినంటూ ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. పార్శిల్‌లో ఉన్న ఆధారాల ద్వారా ఆమెను డిజిటల్ అరెస్టు చేసినట్లు బెదిరించాడు. అంతేకాదు మీపై నేరస్థులు నిఘా పెట్టారని.. పోలీసులను సంప్రదించొద్దంటూ సూచించాడు. అరెస్టు నుంచి తప్పించుకోవాలంటే అన్ని ఆస్తులను ఆర్‌బీఐకి చెందిన ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉందని నమ్మించాడు. వారి మాటలకు భయపడిపోయిన మహిళ వారు చెప్పినట్లు చేసింది. మొత్తం తన వద్ద ఉన్న ఆస్తులు, డబ్బు అంతా వారికి అప్పగించింది. ఫిక్స్‌డ్ డిపాజిట్స్, ఇతర సేవింగ్స్‌ను మోసగాళ్లు పంపిన 187 బ్యాంకు ఖాతాలకు విడతలవారీగా బదిలీ చేసింది. ఇలా దాదాపు ఆరు నెలల్లో ఆమె నుంచి రూ.32 కోట్లు దోచుకున్నారు సైబర్ నేరగాళు .. క్లియరెన్స్ పూర్తయ్యాక ఫిబ్రవరిలో ఆ డబ్బును తిరిగిస్తామని చెప్పారు. ఈ మేరకు బాధితురాలికి నకిలీ క్లియరెన్స్ లెటర్‌ను కూడా జారీ చేశారు. కొన్ని రోజులకు ఆమె తన డబ్బును తిరిగి ఇవ్వాలంటూ ఒత్తిడి చేసింది.

## బీహార్ ఎన్నికల్లో ప్రపంచ బ్యాంకు నిధులు

**ఎన్డీయేపై ప్రశాంత్ కిశోర్ ఆరోపణలు**

**రూ.14 వేల కోట్లను ఓట్ల కోసం వాడారని విమర్శ**

పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ (పీకే) అధికార ఎన్డీయే కూటమిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ప్రపంచ బ్యాంకు కేటాయించిన రూ.14 వేల కోట్ల నిధులను ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల సమయంలో దుర్వినియోగం చేసిందని ఆయన విమర్శించారు. ఈ నిధులను మళ్లించి, ఎన్నికలకు ముందు మహిళల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున జమ చేశారని ఆయన ఆరోపించారు. ప్రశాంత్ కిశోర్ నిన్న మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఏడాది జూన్ నుంచి ఎన్నికల ప్రకటన వెలువడే వరకు నితీశ్ ప్రభుత్వం ఓట్లను కొనుగోలు చేసేందుకు దాదాపు రూ.40 వేల కోట్లు ఖర్చు చేసిందని ఆరోపించారు. ఇది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని, ఈ మొత్తం వ్యవహారంపై ఎన్నికల కమిషన్ సమగ్ర దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. బీహార్ ఎన్నికలకు ముందు ప్రభుత్వం 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' పథకం కింద 75 లక్షల మంది మహిళలకు నవరాత్రి కానుకగా రూ.10 వేలు అందించింది. మహిళా సాధికారత, స్వయం ఉపాధి కల్పించేందుకే ఈ నగదు అందించామని, భవిష్యత్తులో ఈ సహాయం రూ.2 లక్షల వరకు పెంచుతామని అప్పట్లో ప్రధాని మోదీ, బీహార్ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఈ పథకం వెనుక ఓటర్లను ప్రలోభపెట్టే ఉద్దేశం ఉందని ప్రశాంత్ కిశోర్ ఆరోపిస్తున్నారు.

## ఢిల్లీ కాలుష్యానికి తాత్కాలికం సరిపోదు

**సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ: ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతంలో వాయు నాణ్యత సూచీ తరచూ 300 నుంచి 400 దాటుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తాత్కాలిక పరిష్కారాలతో కాలుష్యాన్ని అరికట్టలేమని పేర్కొంది. కాలుష్యం నేపథ్యంలో రాజధానిలో నిర్మాణాలపై నిషేధం విధించేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. పర్యావరణ ఆందోళనలు, అభివృద్ధి మధ్య సమతుల్యం ఉండాలని స్పష్టం చేసింది. ఢిల్లీలో వేగంగా పెరుగుతున్న కాలుష్య సమస్యను అరికట్టేందుకు నిర్మాణాలపై నిషేధం విధించడం వంటి సంచలన ఆదేశాలు ఇచ్చేందుకు సుముఖంగా లేమని ఈ సందర్భంగా కోర్టు స్పష్టం చేసింది. ఈ కాలుష్య సంక్షోభాన్ని పరిష్కరించే లక్ష్యంగా నవంబర్ 19లోగా ఒక ప్రణాళికతో రావాలని కేంద్రాన్ని ఆదేశించింది. తాత్కాలిక పరిష్కారాలతో ఎలాంటి ప్రయోజనం ఉండదని, దీర్ఘకాలిక పరిష్కారాలను రూపొందించాలని సూచించింది.



## కీర్తి సురేశ్‌కు అరుదైన గౌరవం

**యూనిసెఫ్ ఇండియా సెలబ్రిటీ అడ్వకేట్‌గా నియామకం**

న్యూఢిల్లీ: ప్రముఖ నటి కీర్తి సురేశ్‌కు అరుదైన గౌరవం లభించింది. ఐక్యరాజ్యసమితికి చెందిన యూనిసెఫ్ (యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్) ఇండియా విభాగానికి ఆమె సెలబ్రిటీ అడ్వకేట్‌గా నియమితులయ్యారు. ఈ కొత్త బాధ్యతలు చేపట్టడం పట్ల కీర్తి సురేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ఆమె తెలిపారు. ఈ నియామకంపై యూనిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్‌కాఫ్రీ మాట్లాడుతూ.. "కీర్తి సురేశ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోవడం మాకు ఎంతో సంతోషంగా ఉంది. ప్రేక్షకులతో ఆమెకున్న బలమైన అనుబంధం, పిల్లల హక్కులు, వారి శ్రేయస్సు కోసం పోరాడటానికి బలమైన వేదిక అవుతుందని విశ్వసిస్తున్నాం" అని ఆమె పేర్కొన్నారు. అనంతరం కీర్తి మాట్లాడుతూ.. "ప్రతి చిన్నారికి సంతోషంగా, ఆరోగ్యంగా జీవించే హక్కు ఉంది. వారి నేపథ్యంతో సంబంధం లేకుండా, ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందేలా అవగాహన కల్పించేందుకు యూనిసెఫ్ ఇండియాతో చేతులు కలపడం గౌరవంగా ఉంది" అని కృతజ్ఞతలు తెలిపారు. పిల్లల శ్రేయస్సే దేశానికి పునాది అని తాను బలంగా నమ్ముతానని ఆమె వివరించారు.

## అమెరికా నుంచి వంటగ్యాస్

**ఒప్పందం కుదుర్చుకున్న భారత్**

న్యూఢిల్లీ: దేశంలో ఇంధన భద్రతను పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశీయ అవసరాల కోసం అమెరికా నుంచి భారీ ఎత్తున లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) దిగుమతి చేసుకునేందుకు చారిత్రాత్మక ఒప్పందం కుదిరినట్లు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురీ తాజాగా ప్రకటించారు. ప్రజలకు అందుబాటు ధరలో వంటగ్యాస్ అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా ప్రభుత్వ రంగ చమురు సంస్థలు అమెరికన్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయని హర్దీప్‌సింగ్ పురీ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. ఈ డీల్ ఏడాది పాటు అమల్లో ఉంటుందని, దీని ద్వారా యూఎస్ గల్ఫ్ కోస్ట్ నుంచి ఏటా 2.2 మిలియన్ మెట్రిక్ టన్నుల ఎల్పీజీని భారత్ దిగుమతి చేసుకోనుందని పేర్కొన్నారు. ఇది దేశ వార్షిక ఎల్పీజీ దిగుమతుల్లో దాదాపు 10 శాతానికి సమానమని వివరించారు. భారత ప్రభుత్వ రంగ సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) కొన్ని నెలలుగా అమెరికన్ సంస్థలతో జరిపిన చర్చలు ఫలించడంతో ఈ ఒప్పందం సాకారమైంది. వంటగ్యాస్ సేకరణ మార్గాలను విస్తరించడం ద్వారా దేశ ప్రజలకు నిరంతరాయంగా, సరసమైన ధరలకే ఎల్పీజీని అందించడంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని కేంద్రం భావిస్తోంది.

## రజనీ, బాలయ్యకు ఇఫీలో సన్మానం

**కీలక ప్రకటన చేసిన కేంద్ర ప్రభుత్వం**

న్యూఢిల్లీ: ప్రముఖ నటులు రజనీకాంత్, బాలకృష్ణలకు అరుదైన గౌరవం దక్కింది. గోవాలో జరగనున్న 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి) వేడుకల్లో వీరిద్దరినీ ఘనంగా సత్కరించనున్నారు. చిత్ర పరిశ్రమలో 50 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సన్మానం చేయనున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ అధికారికంగా ప్రకటించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మురుగన్ ఈ వివరాలను వెల్లడించారు. "రజనీకాంత్, బాలకృష్ణ తమ సినీ ప్రయాణంలో 50 ఏళ్లు పూర్తి చేసుకోవడం భారతీయ సినిమా చరిత్రలో ఒక మైలురాయి. వారి అద్భుతమైన నటన, ప్రజాదరణతో దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరించారు. వారి కృషికి గుర్తింపుగా ఇఫి ముగింపు వేడుకల్లో వారిని సన్మానిస్తాం" అని ఆయన తెలిపారు. ప్రతిష్ఠాత్మక ఇఫి వేడుకలు నవంబర్ 20 నుంచి 28 వరకు గోవాలో జరగనున్నాయి. 1975లో 'అపూర్వ రాగంగళ్' చిత్రంతో నటుడిగా ప్రయాణం మొదలుపెట్టిన రజనీకాంత్, తనదైన స్టైల్‌తో ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నారు. మరోవైపు, బాలకృష్ణ నటుడిగా రాణిస్తూనే సామాజిక సేవలోనూ తనదైన ముద్ర వేశారు. ప్రస్తుతం ఆయన వరుస సినిమాలతో బిజీగా ఉండగా, 'అఖండ 2' విడుదలకు సిద్ధమవుతోంది.

## 20న బీహార్‌లో కొత్త ప్రభుత్వం

**హాజరుకానున్న ప్రధాని మోదీ**

పాట్నా: బీహార్‌లో ఎన్డీఏ కూటమి తరఫున ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ 10వ సారి పగ్గాలు చేపట్టనున్నారు. ఈ నెల 20న (గురువారం) కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. సీఎంగా నితీశ్ కుమారు, పలువురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి పాట్నాలోని చారిత్రక గాంధీ మైదాన్ వేదిక కానుంది. ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ హాజరుకానున్నారు.

## కాపర్ గనిలో వంతెన కూలి 32 మంది మృతి

న్యూఢిల్లీ: ఆఫ్రికా దేశం కాంగోలో ఘోర ప్రమాదం జరిగింది. కాపర్ గనిలో వంతెన కుప్పకూలింది. దీంతో 32 మంది మృతి చెందారు. కాంగోలోని లువాలాబా ప్రావిన్స్‌లోని కలాండో సైట్‌లో రాగి గని ఉంది. ఈ మైనింగ్ సైట్‌లో వందలమంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈ క్రమంలో మైనింగ్ వద్ద కాల్పుల శబ్దం వినిపించడంతో ఇరుకైన వంతెనపై కార్మికులు ఒక్కసారిగా పరుగులు తీశారు. దీంతో అది కుప్పకూలిపోయింది.

వయ్యారి చిత్రం



అనుసుయ అగ్నిహోత్రి



## వచ్చే ఏడాది పెళ్లి చేసుకుంటా

మెగా మేనల్లుడు సాయితేజ్ నుంచి పెళ్లి విషయమై అధికారిక ప్రకటన కొన్ని గంటల క్రితమే వచ్చేసింది. కొత్త ఏడాదిలో ధాంపత్య జీవితంలోకి అడుగుపెడుతున్నట్లు వెల్లడించాడు. పెళ్లి వార్త కోసం మెగా అభిమానులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నారో చెప్పాల్సిన పనిలేదు. తోటి హీరోలంతా ఓ ఇంటి వారు అవుతున్నా? సాయితేజ్ మాత్రం ఇంకా పెళ్లి చేసుకోలేదు ? ఏంటి? అనే చర్చ నిరంతరం జరిగేది. ఇప్పుడా చర్చకు తావు లేకుండా శాశ్వతంగా పుల్ స్టాప్ పెట్టేస్తున్నాడు. అయితే పెళ్లి కూతురు ఎవరు? అన్నది మాత్రం సాయితేజ్ గోప్యంగానే ఉంచాడు. తాను మనువాడే అమ్మాయి ఎవరో తెలియకుండా ముందే ప్రకటన చేయడుగా? అన్ని ఒకే అయిన తర్వాత విషయం వెల్లడించాడు. కానీ వధువు విషయంలో ఇంత గోప్యత దేనికో. మరి సాయితేజ్ ది ప్రేమ వివాహమా? పెద్దల కుద ర్చిన పెళ్లా? అంటే దాని గురించి కూడా ఎలాంటి కామెంట్ చేయలేదు. అయితే సాయితేజ్ పెళ్లి విషయంలో రెండు నెలల క్రితమే ఓ వార్త వెలుగులోకి వచ్చింది. కొత్త ఏడాది లో పెళ్లి చేసుకుంటాడని..ఆ సంబంధం పెద్దలు చూసిన అమ్మాయని నెట్టింట ప్రచారంలోకి వచ్చింది. తమ కుటుంబానికి బాగా తెలిసిన అమ్మాయి అని.. విదేశాల్లో ఉద్యోగం చేస్తోందని వినిపించింది. ఈ నేపథ్యంలో అప్పటి ప్రచారాన్నే సాయితేజ్ నిజం చేస్తున్నట్లు కనిపిస్తోంది. అలాగే సాయితేజ్ తమ్ముడు వైష్ణవ్ తేజ్ వివాహం కూడా అన్నయ్య పెళ్లితో పాటే, జరుగుతుందని కూడా ప్రచారం జరిగింది. కానీ ఆ తర్వాత మళ్లీ ఎలాంటి అప్డేట్ లేదు. తాజాగా సాయితేజ్ ప్రకటనతో తన పెళ్లి అయితే ఖరారైనట్లు క్లారిటీ వచ్చేసింది. కాబట్టి ఇకపై పిల్ల ఎవరు? అన్న చర్చ ప్రధాన చర్చగా మారుతుంది.

## అమెరికాలో రామానాయుడు స్టూడియో!?

రామానాయుడు స్టూడియో అంటే సినిమాలకు నిలయం లాంటిది. నిత్యం కొత్త సినిమాల ప్రారంభోత్సవాలతో, షూటింగ్ లతో హడావుడిగా ఉంటుంది. మరోవైపు ల్యాబ్ లో జరిగాల్సిన పనులు జరుగుతుంటాయి. అలాగే సాగర నగరం విశాఖ పట్టణంలోకూడా ఆ రోజుల్లోనే రామానాయుడు స్టూడియోను స్థాపించారు. తీరాన్ని అనుకుని ఉన్న స్టూడియో ఎంతో సుందరంగా ఉంటుంది. అయితే, రామానాయుడు స్టూడియోను అమెరికాలో కూడా స్థాపించాలని కలలు గనేవారని తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని ఆయన మనవడు, నటుడు రానా రివీల్ చేసారు. లీడర్ సినిమా సమయంలోనే రానాతో ఈ మాట రామానాయుడు అన్నారు. ఆ సినిమా డైరెక్టర్ శేఖర్ కమ్ములా అమెరికాలో ఉద్యోగం చేసి హైదరాబాద్ కి వచ్చి లీడర్ సినిమా తీసిన సమయంలోనే ఈ మాట అన్నట్లు రానా తెలిపారు. అప్పటి రోజుల్లోనే తాతయ్య ఎంతో అడ్వాన్స్‌గా ఆలోచించేవారన్నారు. లీడర్ సినిమా గురించి మాట్లాడుతారనుకుంటే.. ఆయన ఆమెరికాలో స్టూడియో గురించి మాట్లాడుతున్నారేంటి? తనకనిపించేదన్నారు.




## మహేశ్‌బాబు అన్న కొడుకు, రవీనా కూతురు జోడీగా!

ఘట్టమనేని కుటుంబం నుంచి మూడో తరం హీరో ఎంట్రీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సూపర్ స్టార్ మహేష్ బాబు సోదరుడు రమేష్ బాబు తనయుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. 'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' వంటి సినిమాలకు దర్శకత్వం వహించిన అజయ్ భూపతి ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతుండగా, సినిమా నుంచి మరో ఆసక్తికర అప్డేట్ బయటకు వచ్చింది.ఈ చిత్రంలో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ రవీనా టాండన్ కుమార్తె రషా తడానీ అధికారికంగా కన్ఫర్మ్ అయ్యింది. ఇది ఆమెకు తొలి తెలుగు చిత్రం. ఈ సందర్భంగా టీం ప్రత్యేక పోస్టర్ విడుదల చేస్తూ రషాకు గ్రాండ్ వెల్‌కమ్ చెప్పింది. కొద్ది రోజులుగా ఆమె నటిస్తుందంటూ ప్రచారం జరుగుతుండగా, సోమవారం విడుదలైన పోస్టర్‌తో దీనికి అధికారిక క్లారిటీ వచ్చింది.

## పిల్లల్ని నాశనం చేయకండి

పిల్లల కోసం డబ్బులు దాచి పెడుతూ తల్లిదండ్రులు వారి జీవితాన్ని నాశనం చేస్తున్నారని మలయాళ నటి మలయాళం మూవీ ఆర్టిస్ట్ అసోయేషన్ అధ్యక్షురాలు శ్వేతామీనన్ అన్నారు. ఇలా చేయడం అతి పెద్ద తప్పుగా భావించారు. తల్లిదండ్రులగా వారు గొప్పగా జీవించడం మొదలు పెడితే పిల్లలు వారిని చూసి వారు ఎలా బ్రతాకాలో నేర్చుకుంటారంది. పిల్లలకు అన్ని అందించడం అంటే వాళ్లను శిక్షిస్తున్నట్లే అన్నారు. పిల్లలకు కావాల్సింది కోట్లు కాదు. ప్రేమ మంచి జ్ఞాపకాలు. తల్లిదండ్రులగా పిల్లలకు మంచి విద్య, ఆరోగ్యం మాత్రమే అందించాలన్నారు. వాళ్లని నచ్చిన రంగం వైపు వెళ్లేలా ప్రోత్సహించాలన్నారు. అది వారి జీవితానికి ఉపయోగపడేది అయి ఉండాలన్నారు. తన కుమార్తె విషయంలో తాను అలాగే వ్యవహరిస్తునన్నారు. నా సంపాదన చూసి అదంతా నాదే అని నా కూతురు భావిస్తుంది. కానీ అది నీది కాదు..నాది అని గట్టిగా చెప్పి వాస్తవ జీవితం ఎలా ఉంటుందన్నది గుర్తు చేస్తానంది.





## నేడు ఆంధ్రా కింగ్ తాలూకా ట్రైలర్ రిలీజ్

రామ్ పోతినేని, మైత్రీ మూవీ మేకర్స్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమా.. ఒక అభిమాని బయోపిక్ అనే ట్యాగ్‌లైన్‌తో ఈ నెల 27న విడుదల చేయడానికి సిద్ధమయ్యారు. సినిమా విడుదలకు ముందే, ఆడియో ఆల్బమ్ మాత్రం గట్టిగానే సౌండ్ చేస్తోంది. ఈ ఆల్బమ్‌లో ఇప్పటికే చార్ట్‌బస్టర్‌గా నిలిచిన "నువ్వుంటే చాలు" అనే సోల్‌ఫుల్ రొమాంటిక్ పాటకు రామ్ స్వయంగా లిరిక్స్ అందించారు. కెరీర్‌లో మొదటిసారి పాట రాసినా, రామ్ తనలోని రచయితను పరిచయం చేశాడు. దానికి రాక్‌స్టార్ అనిరుధ్ గాత్రం తోడవ్వడంతో ఈ పాట పెద్ద హిట్‌గా నిలిచింది. రచయితగా మారడమే కాదు, "పప్పీ షేమ్" అంటూ సాగిన పెప్పీ సాంగ్ ని రామ్ స్వయంగా పాడాడు. ఈ ఫన్ సాంగ్‌కు రామ్ ఎనర్జీ పర్ఫెక్ట్‌గా సరిపోయింది. ఈ రెండు పాటల్లో రామ్ ప్రమేయం ఉండగా, మిగిలిన పాటలు కూడా ఆల్బమ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. "చిన్ని గుండెలో" అంటూ సాగిన డ్రీమీ రొమాంటిక్ నంబర్, మైత్రీ వారి భారీ సెట్లను, నిర్మాణ విలువలను కళ్లకు కట్టింది. ఇక ఫ్యాన్స్ కోసం ఎఫ్‌డీఎఫ్‌ఎస్ అంటూ ఒక పక్కా మాస్ సెలబ్రేషన్ సాంగ్‌ను కూడా వదిలారు. ఇలా ఆల్బమ్‌లోని నాలుగు పాటలు నాలుగు విభిన్నమైన ఫ్లేవర్స్‌తో ఉండి, అన్నీ సూపర్ హిట్‌గా నిలిచాయి.

## ఏ వయసు అబ్బాయైనా నాకు ఓకే

ప్రస్తుతం సినిమాలు లేక, సోషల్ మీడియాలో రోజూ ఫోటోలు అప్ డేట్ చేసుకుంటూ వస్తోంది మాజీ బ్యూటీ అమీషా పటేల్. తాజాగా ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా అమీషా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'నా ఏజ్‌లో సగం ఉన్న కుర్రాళ్లు కూడా నన్ను డేటింగ్‌కు పిలుస్తున్నారు. అయితే, నేను మాత్రం ఈ ప్రపోజల్స్ ను సీరియస్‌గా తీసుకోను. కానీ మంచి వ్యక్తి అయితే ఏ వయసైనా ఓపెన్‌గా ఆలోచిస్తాను. ఇక నా పెళ్లి విషయంలో నా మనసుకు నచ్చిన వ్యక్తి దొరికితే ఎప్పుడైనా మ్యారేజ్ చేసుకుంటాను. వయసు అనేది జస్ట్ నంబర్ మాత్రమే. అయినా, నాలో ఇంకా టీనేజ్ లక్షణాలు పోలేదు. అందుకే, నేను ఇప్పటికీ గ్లామరస్ గా కనిపిస్తూ ఉంటాను. అందుకే, కుర్రాళ్ళు నన్ను ఇష్టపడుతూ ఉంటారు' అంటూ తెలిపింది.





## రవిని మంచి కోసం వాడుకోవాలి

దండోరా సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో యాక్టర్ శివాజీ ఐబొమ్మ రవిపై ఆసక్తికర కామెంట్స్ చేశాడు. వాడికేదో బాధ.. మొత్తానికి వాడిని పట్టేశారు. కానీ ఆ అబ్బాయి మంచి హ్యాకర్ అని విన్నాను. ఆ అబ్బాయిని మంచి పని కోసం వాడుకోవాలని కోరుకుంటున్నా. అతడు కనీసం ఇక నుంచి మారి దేశానికి ఉపయోగపడే మనిషిగా తయారైతే బాగుంటుందన్నాడు శివాజీ. టాలెంట్ ఎవడి సొత్తు కాదండి. అతను నిరూపించాడు. చేసింది చాలా దుర్మార్గమైన పని అయినా సరే.. అతని టాలెంట్ గురించి వింటుంటే.. నిజంగా వాడు ఒక దేశానికి పనికొస్తాడు కదా.. ఈ మనిషిని ఎక్కడన్నా సెక్యూరిటీ సిస్టమ్‌లో అతని వినియోగించుకోవచ్చు కదా అని నాకు అనిపించింది. కానీ తెలిసీ తెలియని వయస్సు. కచ్చితంగా ఏదో ఒక డబ్బు లేని తనం. ఇవన్నీ వెంటబడి అతడి మైండ్‌లో ఇలాంటి ఒక ఆలోచన వచ్చి చాలా మందిని ఇబ్బంది పెట్టాడు. అతనికి తెలియదు చాలా మందికి ఉపయోగపడుతున్నాననుకున్నాడు కానీ. మనకంటూ ఒక రాజ్యాంగం ఉంది.. దానికి లోబడి అందరం బతకాలి కాబట్టి.. ఇకనుంచైనా అతడు మారాలని కోరుకుంటున్నానన్నాడు శివాజీ. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.



## రాజస్థాన్ హెడ్‌కోచ్‌గా మళ్లీ సంగక్కర!

ఐపీఎల్ పద్దెనిమిదో సీజన్‌లో దారుణ ప్రదర్శన.. ఆపై హెడ్‌కోచ్ రాహుల్ ద్రవిడ్ రాజీనామాతో షాక్ తిన్న రాజస్థాన్ రాయల్స్ కొత్త కోచ్‌ను ఖరారు చేసింది. గతంలో మూడు సీజన్లు సేవలందించిన కుమార సంగక్కరను ప్రధాన కోచ్‌గా నియమించింది. ద్రవిడ్ వైదొలిగినప్పటి నుంచి తదుపరి కోచ్‌గా ఈ శ్రీలంక లెజెండ్ పేరు వినించింది. ఊహించినట్టే సోమవారం అతడిని కోచ్‌గా తీసుకుంది రాజస్థాన్. డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా.. కోచ్‌గా రెండు బాధ్యతల్ని సంగక్కరకే అప్పగించింది. రాజస్థాన్‌తో సంగక్కరకు మంచి అనుబంధముంది. 2021లో ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన అతడు.. 2024 వరకూ కొనసాగాడు. సంగక్కర నేతృత్వంలో మెరుగైన ప్రదర్శన చేసిన రాజస్థాన్ 2022 ఫైనల్ ఆడింది. ఆ తర్వాత పదిహేడో సీజన్‌లో ప్లే ఆఫ్స్ చేరింది. దాంతో.. మళ్లీ అతడినే కోచ్‌గా నియమించాలని రాజస్థాన్ యాజమాన్యం భావించింది. ఇదే విషయాన్ని రాజస్థాన్ యజమాని మనోజ్ బడలే ఫ్రాంచైజీ ఎక్స్ పోస్ట్‌లో తెలిపాడు. అయితే, నాలుగేళ్లు జట్టును నడిపించిన సంజూ శాంసన్ ఫ్రాంచైజీని వీడడంతో కాబోయే సారథి ఎవరు? అనేది అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది. ఓపెనర్, పవర్ హిట్టర్ అయిన సంజూను ట్రేడ్ డీల్ ద్వారా చెన్నై సూపర్ కింగ్స్‌కు అమ్మేసి రవీంద్ర జడేజాను కొన్న రాజస్థాన్.. ఎవరికి కెప్టెన్సీ ఇస్తుంది? అనేది తెలియాల్సి ఉంది.



## టెస్ట్ క్రికెట్‌ను నాశనం చేస్తున్నారు: హర్భజన్

టీమిండియా స్పిన్ వ్యూహంపై పలువురు మాజీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే మాజీ హాఫ్ స్పిన్నర్ హర్భజన్ సైతం ఘాటుగా స్పందిస్తూ.. ఇది 'టెస్ట్ క్రికెట్ విధ్వంసం'గా అభివర్ణించాడు. ఈ పరిస్థితులు ప్లేయర్స్ అభివృద్ధికి ఆటంకంగా మారుతాయని చెప్పాడు. 'వారు టెస్ట్ క్రికెట్‌ను పూర్తిగా నాశనం చేశారు. టెస్ట్ క్రికెట్‌కు హృదయపూర్వక నివాళి' అంటూ తన యూట్యూబ్ ఛానెల్‌లో ఘాటు వ్యాఖ్యలు చేశాడు. 'వారు స్పిన్‌కు అనుకూల పిచ్‌లు తయారు చేస్తూ టెస్ట్ క్రికెట్‌ని పూర్తిగా నాశనం చేస్తున్నారు.ఎన్నో ఏళ్లుగా ఇలాంటి పిచ్‌లు తయారు చేస్తున్నారు. కానీ, దీనిగురించి ఎవరూ మాట్లాడరు. ఎందుకంటే ఇన్నాళ్లు బాగానే ఉందని, జట్టు గెలిచినప్పుడు ప్రతీది బాగానే కనిపిస్తుంది. ఎవరో వికెట్లు తీయడంతో జట్టు గెలిచింది. వికెట్లు పడగొట్టినవారంతా గొప్ప క్రికెటర్లుగా మారారు. ప్రతి ఒక్కరూ ప్రతీది బాగా జరుతుందని భావిస్తారు. ఈ ధోరణి ఇప్పుడే ప్రారంభం కాలేదు. ఇది సంవత్సరాలుగా కొనసాగుతోంది. ఇది తప్పుడు మార్గమని భావిస్తున్నాను. ఈ సమస్యను పరిష్కరించాల్సిన సమయం ఆసన్నమైంది. ఎందుకంటే అలాంటి పిచ్‌లు ఆటగాళ్ల అభివృద్ధికి దోహదపడవు. క్రీజును వదిలి ముందుకురావడం లేదు. మీరు మిల్లుకు కట్టిన ఎద్దులా తిరుగుతున్నారు. ఇలాంటి పిచ్‌లు మిమ్మల్ని ఎక్కడికి తీసుకెళ్తాయో ఆలోచించాల్సిన సమయం ఇది. ఇక్కడ మీ బ్యాట్స్‌మెన్ పరుగులు ఎలా స్కోర్ చేయాలో తెలియదు. వారు ఎలా బ్యాటింగ్ చేయాలో తెలియనట్లు కనిపిస్తున్నారు. మ్యాచ్‌లో ప్రత్యర్థి బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేయడంతో బ్యాటర్లు అవుట్ కాలేదు. పిచ్ బౌలింగ్‌కు అనుకూలించడంతో అవుట్ అయ్యారు. పరిస్థితులు పూర్తిగా బౌలింగ్‌కే అనుకూలిస్తే సమర్థుడైన బౌలర్, బ్యాట్స్‌మెన్ల మధ్య తేడా ఏంటీ? టెస్ట్ క్రికెట్‌ను చూస్తే బాధగా ఉంది. మనం ఇలా ఎందుకు చేస్తున్నామో నాకు తెలియదు' అంటూ హర్భజన్ వ్యాఖ్యానించాడు. ఇదిలా ఉండగా.. భారత్-దక్షిణాఫ్రికా మధ్య ఈ నెల 22 నుంచి రెండో టెస్ట్ ప్రారంభం కానున్నది.







## జనవరి 7 నుంచి

# డబ్ల్యూపీఎల్!

### ముంబై, బరోడాల్లోనే మ్యాచ్‌లు.. ఫిబ్రవరి 3న ఫైనల్ బరోడానే!

మహిళల క్రికెట్‌ను కొత్త పుంతలు తొక్కించిన మహిళల ప్రీమియర్ లీగ్ మరో ఎడిషన్‌కు సిద్ధమవుతోంది. మూడు సీజన్లుగా అభిమానులను స్టేడియాలకు రప్పించిన ఈ మెగా టోర్నీ నాలుగో సీజన్ జనవరిలోనే ప్రారంభం కానుంది. ఐదు ఫ్రాంచైజీలు రీటెన్షన్ జాబితాను సమర్పించడంతో వేలానికి సన్నాహకాలు చేస్తున్న నిర్వాహకులు.. టోర్నీ తేదీలను కూడా ఖరారు చేసే పనిలో ఉన్నారు.

క్రిక్‌బజ్ కథనం ప్రకారం జనవరి 7 నుంచి ఫిబ్రవరి 3 వరకూ నాలుగో సీజన్ జరుగనుందని సమాచారం. వచ్చే ఏడాది భారత్, శ్రీలంక సంయుకంగా పురుషుల టీ20 వరల్డ్‌కప్ పోటీలకు ఆతిథ్యమిస్తున్నాయి. ఫిబ్రవరి మొదటి వారంలోనే ప్రపంచకప్ జరుగనున్న నేపథ్యంలో డబ్ల్యూపీఎల్ షెడ్యూల్‌ను ముందుకు జరిపారు నిర్వాహకులు. అందుకే.. ఫిబ్రవరిలో ప్రారంభం కావాల్సిన టోర్నీ ఈసారి జనవరిలోనే షురూ కానుంది.

అంతేకాదు మూడో సీజన్ మాదిరిగా కాకుండా డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ మ్యాచ్‌లను రెండు నగరాల్లో నిర్వహించే అవకాశముంది. రెండు విడతలుగా సాగే ఈ మెగా ఈవెంట్‌కు ముంబై, బరోడాలను వేదికలుగా ఎంపిక చేసినట్టు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. తొలిదశ మ్యాచ్‌లు నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో.. రెండో దశ మ్యాచ్‌లు బరోడాలోని కోటంబి మైదానంలో డబ్ల్యూపీఎల్ మ్యాచ్‌లు ఆడించనున్నారు. జనవరి 16 నుంచి.. ఫిబ్రవరి 3న ఫైనల్ వరకూ బరోడానే వేదిక కానుందని టాక్. అయితే.. టోర్నీ ఆరంభ తేదీ, వేదికలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



### మంధానకు రికార్డు ధర

మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ కోసం భారత క్రికెటర్లను ఫ్రాంచైజీలు భారీ ధరకు రీటైన్ చేసుకున్నాయి. విశ్వవిజేతగా అవతరించిన టీమిండియాలోని సభ్యులైన స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, రీచా ఘోష్ బ్యాండు వాల్యూ పెరగడమే కాదు రీటైన్ ధర కూడా కోట్లకు చేరింది. స్వదేశంలో ముగిసిన వరల్డ్ కప్‌లో చెలరేగి ఆడిన మంధానను రూ.3.50 కోట్ల రికార్డు ధరకు ఆర్సీబీ రీటైన్ చేసుకుంది. వరల్డ్ కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా ఎంపికైన దీప్తి శర్మను యూపీ వారియర్స్ వదిలేసింది. డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ వేలంలో ఫ్రాంచైజీలు రూ.15 కోట్లు ఖర్చు చేయనున్నాయి. స్లాబ్స్ విషయానికొస్తే.. ఒక క్రికెటర్‌కు మాత్రమే రూ.3.5 కోట్లు చెల్లించే అవకాశముంది. రెండో ప్లేయర్‌కు రూ.2.5 కోట్లు, మూడో ప్లేయర్‌కు రూ.1.75కోట్లు, నాలుగో బ్యాటర్‌కు రూ.1 కోటి.. ఐదుగురు ప్లేయర్లకు రూ.50 లక్షలు వేలం పాట పాడాల్సి ఉంటుంది. ఒక ఫ్రాంచైజీ ఐదుగురిని అట్టిపెట్టుకుంటే వాళ్ల పర్స్ నుంచి రూ.9.75 ను తొలగిస్తారు. ఒకవేళ నలుగురిని రీటైన్ చేసుకుంటే.. రూ.8.75 కోట్లు.. ముగ్గురికి రూ.7.75 కోట్లు, ఇద్దరిని రీటైన్ చేసుకుంటే రూ.6 కోట్లు కట్ చేస్తారు.

## ఇది పద్ధతి కాదు గంభీర్



పిచ్‌పై టీమిండియా వైఖరిని ఖండిస్తున్న వేళ.. బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఈ వ్యవహారంపై స్పందించాడు. గంభీర్‌తో పాటు టీమ్ మేనేజ్‌మెంట్‌కు పలు సూచనలు చేశారు. జట్టు మేనేజ్‌మెంట్ ఏకపక్ష పిచ్‌ను సిద్ధం చేయాల్సిన అవసరం లేదని.. టీమ్ మేనేజ్‌మెంట్ సైతం జట్టు బౌలర్లపై నమ్మకం ఉంచాలని సూచించాడు. కోచ్ గౌతమ్ గంభీర్, జట్టు మేనేజ్‌మెంట్ క్యూరేటర్‌ను అలాంటి పిచ్‌ను సిద్ధం చేయమని కోరినట్లు గంగూలీ వెల్లడించారు. ఇందులో ఎలాంటి వివాదం లేదని.. అయితే, ఇది అత్యుత్తమ టెస్ట్ పిచ్ కాదన్నారు. భారత్ కనీసం 120 పరుగులు చేసి ఉండాల్సిందని పేర్కొన్నాడు. గంభీర్ స్వయంగా తనకు అలాంటి పిచ్ కావాలని చెప్పాడని.. క్యూరేటర్‌కు కూడా సూచించినట్లుగా గంగూలీ తెలిపాడు. తాను గంభీర్‌ను గౌరవిస్తానని.. ఇంగ్లండ్‌లో వన్డేలు, టీ20ల్లో టీమిండియా అద్భుతంగా అతని పర్యవేక్షణలో రాణించింది. కానీ, మనం మంచి, సమతుల్య పిచ్‌లపై ఆడాలని సూచించాడు గంగూలీ. బౌలర్లను, ముఖ్యంగా జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్ వంటి మ్యాచ్ విన్నర్లను విశ్వసించాలంటూ చెప్పాడు. 'మనం బుమ్రా, సిరాజ్, షమీలను నమ్మాలి. మన స్పిన్నర్లు కూడా టెస్టులు గెలుస్తారు. పిచ్‌ను ఏకపక్షంగా మార్చాల్సిన అవసరం లేదు' అని తెలిపాడు. చివరగా గంగూలీ మాట్లాడుతూ 'మూడు రోజుల్లో కాదు.. ఐదురోజుల్లో టెస్టు మ్యాచులు గెలవండి' అంటూ హితవు పలికాడు. బ్యాట్స్‌మెన్, బౌలర్లు ఇద్దరికీ సమాన అవకాశాలు కల్పించే పిచ్‌లపై భారత్ ఆడాలని, ఆటను ఉత్తేజపరిచేలా, సమతుల్య పరిస్థితుల్లో జట్టు గెలవడం నేర్చుకోవాలని కోరుకుంటున్నట్లుగా గంగూలీ స్పష్టం చేశాడు.



## బవుమాకు బుమ్రా క్షమాపణలు!

బవుమాకు బుమ్రా క్షమాపణలు చెప్పినట్లు తెలిసింది. మ్యాచ్ అయిపోయాక బవుమాతో మాట్లాడుతూ.. తాను ఉద్దేశపూర్వకంగా అనలేదని వివరణ ఇస్తూ కనిపించాడు. సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో బవుమా బ్యాటింగ్ చేసే సమయంలో బుమ్రా, రిషభ్ పంత్ మధ్య రివ్యూ కోసం జరిగిన సంభాషణ స్టంప్ మైక్‌లో రికార్డ్ అయ్యింది. బవుమా ఎల్బీడబ్ల్యూ విషయంలో రివ్యూ తీసుకోవాలా? వద్దా? అనే చర్చలో బవుమా మరుగుజ్జు అంటూ బుమ్రా వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. పంత్ కూడా అతను పొట్టోడే అయినా బంతి వికెట్ల కంటే ఎత్తులో వెళ్లిందని వివరించాడు. ఈ ఇద్దరూ ఉద్దేశపూర్వకంగా అనకపోయినా.. ఈ వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. అయితే ఈ కామెంట్స్‌ను బవుమా.. సౌతాఫ్రికా టీమ్ సీరియస్‌గా తీసుకోలేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం విమర్శలు వినిపించాయి. 'మరుగుజ్జు అన్నారు.. మట్టికరిపించాడు.'అని భారత అభిమానులు కూడా టీమిండియా ఓటమి నేపథ్యంలో ట్రోలింగ్‌కు దిగారు.

## చచ్చిపోవాలనిపిస్తోంది: యోగ్‌రాజ్ సింగ్



ఒంటరి జీవితం నరకంగా ఉందని, తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నానని టీమిండియా మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ తండ్రి యోగ్‌రాజ్ సింగ్ అన్నాడు. తన జీవితంలో అన్ని చూశానని, చావడానికి సిద్దంగా ఉన్నానని తెలిపాడు. తాను ప్రేమించిన వారంతా దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశాడు. తన జీవితంలో సాధించాల్సింది, అనుభవించేది ఏది లేదని తాజాగా ఓ ఇంటర్వ్యూలో 62 ఏళ్ల యోగ్‌రాజ్ సింగ్ చెప్పుకొచ్చాడు. 'నేను సాయంత్రం ఒంటరిగా కూర్చుంటాను. నా ఇంట్లో ఎవరూ ఉండరు. తిండి కోసం ఇతర వ్యక్తులపై ఆధారపడుతాను. కొన్నిసార్లు ఒకరు పెడితే.. మరికొన్ని సార్లు మరొకరు తెచ్చిస్తారు. అయితే ఆహారం కోసం నేను ఎవర్నీ ఇబ్బంది పెట్టను. నాకు ఆకలిగా ఉన్నప్పుడు మాత్రం ఎవరో ఒకరు ఆహారం తెచ్చిస్తారు. నా వంట కోసం పనివారిని పెట్టుకున్నాను. వారు వారి పని చేసుకొని వెళ్లి పోతారు. నాకు మా అమ్మ, పిల్లలు, కోడలు, మనవలు, కుటుంబంలోని ప్రతీ ఒక్కరితో కలిసి ఉండాలని ఉంది. కానీ నేను ఎవర్నీ నాతో ఉండాలని అడగను. నేను చావడానికి సిద్ధంగా ఉన్నాను.

డిజిటల్ యుగంలో ప్రజలను కలవరపాటుకు గురిచేస్తున్న డిజిటల్ అరెస్ట్ సైబర్ మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఈ మోసాలు ఎంత భయంకరంగా మారాయంటే, ప్రముఖ సినీ నటుడు నాగార్జున సైతం తమ కుటుంబ సభ్యుల్లో ఒకరు ఈ స్కామ్ బారిన పడి రెండు రోజులు ఇంట్లోనే బందీ అయ్యారని, తీవ్ర మనస్తాపానికి గురయ్యారని బహిరంగంగా వెల్లడించారు. కేవలం కొందరినే కాదు, దేశంలోని ఉన్నత విద్యావంతులు, ఉన్నతాధికారులు, వ్యాపారవేత్తలు ఈ అంతర్జాతీయ ముఠాల వలకు చిక్కి రూ. వేల కోట్లు నష్టపోతున్నారు. ఈ నేరాల తీవ్రతపై సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ ముప్పును ఎదుర్కోవడానికి కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని, దర్యాప్తు సంస్థలను ఆదేశించింది.




# డిజిటల్ అరెస్ట్.. జర జాగ్రత్త!



వినోద్ కుమార్

డిజిటల్ అరెస్ట్ స్కామ్‌ల ద్వారా సైబర్ కేటుగాళ్లు గడచిన రెండేళ్లలో దేశవ్యాప్తంగా సామాన్యుల నుంచి రూ. 2,500 కోట్ల నుంచి రూ.3,000 కోట్లకు పైగా దోచుకున్నట్టు కేంద్ర ప్రభుత్వ సంస్థలు గుర్తించాయి. ఈ స్కామ్‌ల వెనుక చైనా, హాంకాంగ్, ఇండోనేషియా, మయన్మార్, థాయ్‌లాండ్ వంటి దేశాలకు చెందిన అంతర్జాతీయ సిండికేట్‌లు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఇటీవల ముంబైకి చెందిన 72 ఏళ్ల వ్యాపారవేత్త రూ. 58 కోట్లు పోగొట్టుకోగా, బెంగళూరుకు చెందిన 57 ఏళ్ల సీనియర్ ఐటీ ఎగ్జిక్యూటివ్ ఏకంగా ఆరు నెలల పాటు వర్చువల్ కస్టడీలో ఉండి రూ. 32 కోట్లు కోల్పోవడం దేశంలోనే సంచలనం సృష్టించింది. నకిలీ కోర్టు ఆదేశాలు, ఫోర్జరీ పత్రాలు సృష్టించి మోసాలకు పాల్పడటంపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ మోసాలను అరికట్టడానికి అసాధారణ ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుందని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు.

## హాట్‌స్పాట్‌గా తెలుగు రాష్ట్రాలు

డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లకు దేశంలోనే హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ ప్రధాన కేంద్రాలు (హాట్‌స్పాట్‌లు)గా మారినట్లు 'ఇండియన్ సైబర్ క్రైం కో ఆర్డినేషన్ సెంటర్' నివేదిక స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా నమోదవుతున్న మొత్తం డిజిటల్ అరెస్ట్ కేసులలో సుమారు 19.97% కేసులు హైదరాబాద్‌లోనే నమోదవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2024లో రాష్ట్రవ్యాప్తంగా రూ. 177 కోట్ల కు పైగా మోసాలు నమోదయ్యాయి. 'డిజిటల్ అరెస్ట్' తర్వాత గుండెపోటుతో రిటైర్డ్ డాక్టర్ మృతి చెందిన విషాద సంఘటన కూడా హైదరాబాద్‌లోనే చోటుచేసుకుంది. ఇటీవలే ఏపీకి చెందిన ఓ ఎమ్మెల్యే భార్య సైతం డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లో చిక్కుకొని రూ. 1.70 కోట్లు పోగొట్టుకున్న సంఘటన ఈ ముప్పు తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ మోసగాళ్లు ముఖ్యంగా 30 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న వారిని, పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ఉన్నవారిని లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

| రాష్ట్రం | కాలం | కేసుల సంఖ్య (సుమారు) | దోచుకున్న మొత్తం (సుమారు) |
| --- | --- | --- | --- |
| తెలంగాణ | గత సంవత్సరం (2024) | 3,037 కేసులు | రూ.177 కోట్లు |
| తెలంగాణ | ఈ ఏడాది 9 నెలల కాలంలో (2025) | 933 కేసులు | రూ. 60 కోట్లు |
| ఆంధ్రప్రదేశ్ | ఇటీవల నమోదైన ప్రముఖ కేసు | ఎమ్మెల్యే భార్య మోసపోయారు | రూ. 1.70 కోట్లు |

## ఇలా మోసం చేస్తారు..!

తమను తాము సీబీఐ, ఈడీ, ఆర్‌బీఐ, కస్టమ్స్, పోలీసులు లేదా ఇతర ప్రభుత్వ దర్యాప్తు సంస్థల ఉన్నతాధికారులుగా పరిచయం చేసుకుంటారు. వీరు బాధితులకు ముందుగా మెసేజ్‌లు లేదా ఫోన్ కాల్స్ చేస్తారు. ఆ తర్వాత వీడియో కాల్ ద్వారా మాట్లాడతారు.

- పోలీస్ యూనిఫాం లేదా నకిలీ ఆఫీస్ సెటప్‌ను చూపించి బాధితుడిని భయపెడతారు.
- మాదకద్రవ్యాల అక్రమ రవాణా, మనీలాండరింగ్ లేదా ఆర్థిక మోసాలు వంటి తీవ్రమైన నేరాలలో మీ పేరు ప్రమేయం ఉందని ఆరోపిస్తారు.
- అరెస్ట్ వారంట్‌లు, కోర్టు సమన్లు, ప్రభుత్వ నోటీసులు వంటి నకిలీ పత్రాలను వాట్సాప్ లేదా స్కైప్‌లో పంపి భయభ్రాంతులకు గురిచేస్తారు.
- కేసు నుంచి బయటపడాలంటే, డిజిటల్ అరెస్ట్ నుంచి విముక్తి పొందాలంటే తక్షణమే భారీ మొత్తంలో డబ్బు (ఫైన్, సెక్యూరిటీ డిపాజిట్, ట్యాక్స్ పేరుతో) బదిలీ చేయాలని డిమాండ్ చేస్తారు.
- వారు చెప్పిన అకౌంట్‌లకు డబ్బు పంపే వరకు బాధితులు ఇతరులతో మాట్లాడకుండా, కాల్ కట్ చేయకుండా "వర్చువల్ కస్టడీ"లో ఉంచుతారు.

### రక్షణ చర్యలు:

- తక్షణమే కాల్ కట్ చేయండి: ఎవరైనా సీబీఐ, ఈడీ, ఆర్‌బీఐ లేదా డీహెచ్‌ఎల్/కొరియర్ కంపెనీ అధికారిగా పేర్కొంటూ, మీ పార్సిల్‌లో నిషేధిత వస్తువులు ఉన్నాయని, మనీలాండరింగ్‌లో మీ పేరు ఉందని వీడియో కాల్ ద్వారా బెదిరిస్తే, వెంటనే కాల్‌ను కట్ చేయండి. నిజమైన దర్యాప్తు సంస్థలు వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయవు లేదా డబ్బు డిమాండ్ చేయవు.
- అధికారిక ధ్రువీకరణ: ఏ అధికారిక సంస్థ అయినా మీకు నోటీసులు పంపితే, వారి అధికారిక వెబ్‌సైట్ లేదా కార్యాలయానికి వెళ్లి నిజానిజాలు తెలుసుకోండి. ఫోన్ ద్వారా వచ్చిన నంబర్లు లేదా పత్రాలను నమ్మవద్దు.
- సామాజిక మాధ్యమాలను నమ్మవద్దు: ప్రభుత్వ సంస్థలు తమ అధికారిక కమ్యూనికేషన్ల కోసం వాట్సాప్, స్కైప్ వంటి సాధారణ వీడియో కాన్ఫరెన్సింగ్ సాధనాలను ఉపయోగించవు.
- వ్యక్తిగత వివరాలు గోప్యం: మీ బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీలు, క్రెడిట్/డెబిట్ కార్డు పిన్‌లు, పాస్‌వర్డ్లు లేదా ఇతర ఆర్థిక వివరాలను ఏ వీడియో కాల్‌లోనూ, ఫోన్ కాల్‌లోనూ ఇవ్వకండి.
- 'వర్చువల్ కస్టడీ'ని పట్టించుకోవద్దు: మిమ్మల్ని ఆన్‌లైన్‌లో ఉండి, ఎవరితోనూ మాట్లాడకుండా ఉండమని (డిజిటల్ హౌస్ అరెస్ట్) ఒత్తిడి చేస్తే, అది 100% మోసం అని గ్రహించండి.
- ఫిర్యాదు చేయండి: మీరు మోసపోయినట్లు గుర్తిస్తే, ఆలస్యం చేయకుండా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు లేదా ష్ష్ష.ఎఎవతీఎతీఅవవ.స్రశీజ.అఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయండి. నగదును బదిలీ చేయడానికి ఉపయోగించిన ఖాతాలను స్తంభింపజేయడానికి ఇది సహాయపడుతుంది.



# ఐశ్వర్యానికి, మనోశాంతికి శివారాధన

కార్తీక మాసం.. పరమ పవిత్రమైన మాసంగా హిందూ ధర్మంలో పరిగణిస్తారు. ఈ మాసం శివకేశవుల ఇద్దరికీ ప్రీతికరమైనది. ఈ మాసంలో వచ్చే ప్రతి సోమవారం (కార్తీక సోమవారం), ముఖ్యంగా మాస శివరాత్రి రోజుకు విశేష ప్రాధాన్యం ఉంది. ప్రతి నెల కృష్ణ పక్షంలో (బహుళ పక్షం) వచ్చే చతుర్దశి తిథిని మాస శివరాత్రిగా జరుపుకుంటారు. అయితే, ఈ మాస శివరాత్రి కార్తీక మాసంలో రావటం వలన దీనికి మరింత శక్తి, మహత్వం లభిస్తాయి.



మాస శివరాత్రిని మహా శివరాత్రి వలెనే పవిత్రంగా భావిస్తారు. ఈ రోజున భక్తులు ఉపవాసం ఉండి, శివుడిని భక్తి శ్రద్ధలతో పూజించడం వలన అనేక శుభ ఫలితాలు కలుగుతాయని పురాణాలు, ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. మాస శివరాత్రి రోజున ఉపవాసం ఉండి, శివారాధన చేయడం ద్వారా చేసిన పాపాలు నశించి, జీవితంలో కష్టాల నుండి విముక్తి లభిస్తుందని నమ్ముతారు. ఈ రోజు శివుడిని వేడుకుంటే భక్తులు కోరిన కోరికలన్నీ తీరతాయని ప్రగాఢ విశ్వాసం. శివుడిని పూజించడం వలన కుటుంబంలో సుఖ శాంతులు, ఐశ్వర్యం లభిస్తాయి. శివాభిషేకం చేయడం వలన గ్రహదోషా లు, ఈతిబాధలు తొలగిపోతాయని పండితులు చెబుతారు. శివారాధన వలన మనోశాంతి లభిస్తుంది, కోపం, అహంకారం తగ్గుతాయి.

ప్రాముఖ్యత: శివరాత్రి రోజున శివ తత్వం భూమిపై అధిక శక్తితో ఉంటుందని నమ్ముతారు. ఈ సమయంలో శివుడిని పూజిస్తే ఆయన ఆశీస్సులు సులభంగా లభిస్తాయి. ఈ రోజున ఉపవాసం ఉండి, శివ నామస్మరణ చేయటం వలన గతంలో చేసిన పాపాలు నశించి, కష్టాల నుండి విముక్తి లభిస్తుందని నమ్ముతారు. భక్తులు తమ కోరికలు, అభీష్టాలు నెరవేర్చుకోవడానికి, దారిద్ర్యాన్ని తొలగించుకోవడానికి శివుడిని ఈ రోజున ఆరాధిస్తారు. శివుడిని పరమేశ్వరుడిగా, మోక్షాన్ని ప్రసాదించే దేవుడిగా భావిస్తారు. మాస శివరాత్రి పూజ మోక్ష సాధనకు ఒక మెట్టుగా పరిగణించబడుతుంది.

- రామ్ మనోహర్ శర్మ బండపెల్లి
ఆధ్యాత్మిక పండితుడు

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.